వార్త
ఆదివారం
29 జనవరి 2017

పసి బతుకులు మసి!

ఇదీ బాలభారతం..

విశ్రాంతి లేదు

ఇది ఓ హీరో యిన్‌కు బాగా సూట్ అవుతుంది.. ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన అమలాపాల్ ఆమె కెరీర్‌ను పెళ్లికి ముందు. విడాకుల తర్వాత అని విభజించుకోవచ్చని అంటున్నారు. పెళ్లికి ముందు పెద్ద స్టార్లతో చేసినప్పటికీ బిజీగా లేదు.. ప్రస్తుతం విడాకులు తీసుకున్న తర్వాత మాత్రం ఆమె బిజీ బిజీగా మారిపోయింది. ప్రస్తుతం దక్షిణాదిలో తెలుగు మినహా మిగిలిన అన్ని భాషల్లో నటిస్తోంది. రజనీకాంత్ నుంచి ధనుష్ దాకా అందరితో జోడీ కట్టింది.. అరడజనుకు పైగా చిత్రాల్లో నటిస్తూ విరామం లేకుండా విశ్రాంతి లేకుండా బిజీ కావటం సినీ విశ్లేషకులను కూడ ఆశ్చర్య పరుస్తోంది.. తమన్నా, కాజల్, శృతిహాసన్ తరహాలో ట్రెండ్‌ను ఫాలో అవుతూ ఐటెం సాంగ్స్ గర్ల్‌గా మారాలని కూడ నిర్ణయించుకుందట..

తారాతీరం

అగ్నిపరీక్ష

'దేశముదురు'తో టాలీవుడ్‌కి పరిచయమైన బ్యూటీ హన్సిక.. కొంతకాలం కోలీవుడ్‌ను ఏలిన ఈ భామ రెండేళ్ల క్రిందట వచ్చిన రవితేజ పవర్ చిత్రం తర్వాత మళ్లీ కన్పించలేదు.. రెండేళ్ల తర్వాత ఇపుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది.. మంచు విష్ణు సరసన లక్కున్నోడు, యాక్షన్ హీరో గోపీచంద్‌తో మరో చిత్రంలో కూడ ఆమె నటిస్తోంది.. ఈ రెండు చిత్రాలు ఇపుడామెకు అగ్నిపరీక్షగా మారాయి..

ట్రైచేస్తే ఏదో ఒక రోజున..

బాలీవుడ్‌లోనే కాకుండా హాలీవుడ్‌లో కూడ సంచలనం రేపుతున్న హాట్ భామ ప్రియాంకచోప్రా.. అదే కోవలో దీపికాపడుకొనే.. దిశాపాట్నీ, ఆమైరా దస్తూర్ ఇంకా.. తాజాగా హ్యూమా ఖరేషి.. ఇలా బాలీవుడ్‌నుంచి హాలీవుడ్‌కు క్యూ కడుతున్న అందాల భామల జాబితా రోజురోజుకూ పెరుగుతూనే ఉంది.. ఈ మధ్య మీడియాకు ఓ సందేహం వచ్చింది. అదేంటంటే.. కేవలం హీరోయిన్లు మాత్రమే ఎందుకు హాలీవుడ్ వెళ్తున్నారు.. హీరోలెందుకు వెళ్లటం లేదంటూ అనుమానం కలిగింది. అనుమానం వచ్చిందే తడవుగా ఆ మధ్య ప్రియాంకా చోప్రాని ఈ విషయమై ప్రశ్నించగా– హాలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోవాలంటే ఎంతైనా గట్స్.. అవసరం అని వ్యాఖ్యానించినట్టు ముంబాయి మీడియా అంతా కోడై కూసింది. ఆ వార్తల్లో నిజం ఎంతుందో తెలియదుగానీ ఆ విషయాన్ని పట్టుకుని ప్రియాంకపై నానా రభస చేసిందట. ఈ విషయం ప్రియాంకకు తెలిసింది. నానా రభస చేసిన మీడియాపై ప్రియాంక స్పందిస్తూ తాను గట్స్ అన్న పదాన్ని వాడలేదని, ఎందుకు ఆ విషయంపై అంత యాగీ చేశారో తెలియదని స్పష్టం చేసింది.. ప్రయత్నించు.. ప్రయత్నిస్తూనే ఉండు.. ఏదో ఒకరోజు విజయానికి చేరుకుంటావ్.. ప్రయత్నమే చేయకపోతే విజయం ఎలా వరిస్తుందన్నది తన సిద్ధాంతంగా చెప్పుకొచ్చింది.

కె.సురేష్ బాబు



29 జనవరి 2017

విషయ విశేషం

మంచి ముత్యాలు

ధైర్యంతో కూడిన ప్రయత్నం అర్ధవిజయంతో సమానం. ధైర్యంతో అన్ని సమస్యల్ని పరిష్కరించుకోవచ్చు.
కనుక ఎట్టి పరిస్థితులలోనూ ధైర్యాన్ని కోల్పోకూడదు.

-గాంధీజీ



తేనె మనసు

ఎంతో విజ్ఞానదాయకం..

జనవరి వార్త ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కవర్ స్టోరీ 'ఆరోగ్యానికి చేదు కృత్రిమ చక్కెరలు!' ఎంతో విజ్ఞానదాయకంగా ఉంది. కృత్రిమ చక్కెరల గురించి అనేక విషయాలు తెలుసుకోగలిగాం. ఆరోగ్య సంబంధిత అంశాలను ఎంతో విశదంగా తెలియజేస్తున్న మీకు మా కృతజ్ఞలు.

-కె.విజయ్‌బాబు, హైదరాబాద్; ఆర్.సాగర్, కాకినాడ; వి.ప్రత్యూష, కడప.

సెటైర్ బాగుంది

జనవరి వార్త ఆదివారం అనుబంధంలో మూడోకన్ను ఆర్టికల్ '16 నుంచి 17లోకి' ఎంతో బాగుంది. కొత్త సంవత్సరం వచ్చినా జనానికి 'నోట్ల కోసం పాట్లు' తప్పవని బాగానే తెలియజేసింది. 50రోజులు పూర్తవగానే 'అదిగో నవలోకం' బదులుగా, 'గాలివానలో, వాననీటిలో పడవ ప్రయాణం' పాట ప్రజలకు గుర్తు రావడం గొప్ప సెటైర్. కవర్ స్టోరీ ద్వారా కృత్రిమ చక్కెరల గురించిన ఎన్నో కొత్త సంగతులు తెలుసుకో గలిగాం. సింగిల్ పేజీ కథ 'నోట్లు-అగచాట్లు' సమకాలీన పరిస్థితికి అద్దంపట్టింది. రచయిత్రికి మా అభినందనలు.

-అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం, కూకట్‌పల్లి.

ఆర్టికల్స్ ఆకట్టుకున్నాయి..

జనవరి వార్త ఆదివారం అనుబంధంలో భావవీచిక ఎంతో వాస్తవికంగా ఉంది. రాష్ట్రప్రభుత్వ ఔషధ పరిశోధనకు వేదిక ఏర్పాటు ముదావహం. 'కృత్రిమ చక్కెర'ల స్వరూప, స్వభావాలను కవర్‌స్టోరీ ద్వారా చక్కగా విశ్లేషించారు. ఈవారం కవిత్వంలో 'చింతన సమయం' కవిత భావగర్భితంగా ఉంది. 'కృతి' ద్వారా నూతన పుస్తక పరిచయ భాగ్యం కలుగుతోంది. 'కారుచీకట్ల కాశ్మీరంలో కరుణకాంతులు' వెదజల్లుతున్న అధిక్ వంటివారే నిజమైన హీరోలు. బ్యాక్‌కవర్‌పై ఇచ్చిన 'నీటి అద్దంలో ప్రకృతి అందం' దృశ్యం అద్భుతం.

-నేమాన సుభాష్ చంద్రబోస్, విశాఖపట్టణం.

చిత్రభారతి ఆలోచింపజేసింది..

జనవరి వార్త ఆదివారం అనుబంధంలో 'చిత్రభారతి'లో 'చిత్రనిర్మాణానికి కనీస అర్హతలు అవసరంలేదా? ఎంతో బాగుంది మమ్మల్ని ఆలోచింపజేసింది. వాశిరాజువారికి ధన్యవాదాలు.

-ఎన్.సూర్యనారాయణ, విజయవాడ; కె.రవి, చిత్తూరు.

భావ వీచిక



..రోగులతో చెలగాటం

'వైద్యో నారాయణో హరిః' అని మన పెద్దలు వైద్యులను దేవుడిగా సంభావించారు. అటు వంటి వైద్యవృత్తికే మచ్చతెచ్చేలా అనే కానేక సంఘటనలు పునరావృతమవుతు న్నాయి. ఇటీవల హైదరాబాద్ నగరంలోనే జరిగిన సంఘటన..ఓ యువతి తీవ్ర జ్వరం తో బాధ పడుతుండగా ఓ ప్రైవేట్ ఆసుపత్రి లో జాయిన్ చేస్తే, ప్లేట్‌లెట్స్ తగ్గిపోయా యని, ఇన్‌ఫెక్షన్ వచ్చిందని ఒక చేతిని తొలగించారట. ఆ తర్వాత కూడా నయం కాకపోతే రెండోచేతిని, కాళ్లను తీసేయవల సిందేనన్నారట. రోగి కుటుంబం వారు ఈ పరిణామానికి కలతచెంది కేసు పెట్టటంతో విషయం వెలుగులోకి వచ్చింది. మరి నాలుగురోజులకు మరో సంఘటన. ఓ వ్యక్తి కాలునొప్పని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేరితే ఆపరేషన్ చేశారు. తత్ఫలితంగా రెండు కాళ్లూ కదలని పరిస్థితి ఏర్పడింది. చిన్న ఆరోగ్య సమస్యతో ఆసుపత్రికి వెళ్లిన వారిని ఆసుపత్రులు వైద్యం పేరుతో ఎంతో డబ్బు గుంజుకుని, చివరకు రోగులకు శాశ్వత అంగవైకల్యాన్ని ప్రసాదించటం క్షమార్హం కాని విషయం. రోగ నిర్ధారణ, శస్త్రచికిత్స అవసరం ఎంతమేరకు, శస్త్ర చికిత్స చేయటంలో శ్రద్ధ, అంకితభావం.. ఇవేవీ లేకుండా నిర్లక్ష్యధోరణితో రోగుల జీవితాలతో చెలగాటమాడటం ప్రజలందరిని కలవరపరుస్తోన్న అంశం. ఆసుపత్రులు రోగుల్ని ఆదుకోవటం మాట అటుంచి ఆజన్మాంతం బాధపడేలా చేయడాన్ని ఏ విధంగా అర్థంచేసుకోవాలి? గతంలోనూ కంటి వైద్యానికి వెళితే కంటిచూపునే పోగొట్టిన ఘటనలూ ఉన్నాయి. ఇలా ఒకటే మిటి ఎన్నెన్నో ఘటనలు.. ఎప్పటికప్పుడు ఓ రెండురోజులు, లేదంటే ఓ వారం పత్రికలు, ఛానెళ్ల ఆ ఘటనల గురించిన వార్తలు, విశ్లేషణలు ప్రచురిస్తాయి, ప్రసారం చేస్తాయి. ఆ తర్వాత మళ్లీ మామూలే. ప్రభుత్వం, ఆసుపత్రులలో జరిగే వైద్య తప్పిదాలపై తగు చర్యలు చేపట్టాలి. రోగు లకు సవ్యమైన వైద్యం అందేలా, న్యాయం జరిగేలా చూడాలి. అది ప్రభుత్వ ఆసుపత్రి అయినా, ప్రైవేట్ ఆసుపత్రి ఐనా రోగుల జీవితాలతో చెలగాటాన్ని అరికట్టాలి. దోషు లకు కఠినశిక్షలు విధించాలి. ప్రజలు సైతం ఆసుపత్రులకు వెళ్లినప్పుడు వైద్యం విషయమై ముఖ్యంగా చైతన్యంతో, అవగాహనతో వ్యవహరించాలి.

'సంఘీ'భావం



నివారణ, నిర్ధారణే కీలకం!


దేశంలో ప్రాణాంతక వ్యాధులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. ఈ వ్యాధుల చికిత్సకోసం ప్రజలు తల తాకట్టు పెట్టి ఖర్చు చేస్తున్నారు. కొందరు అప్పుల పాలవుతున్నారు. మరికొందరు వ్యాధుల చికిత్స భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వ్యాధిని ఎదుర్కోవడంకన్నా చావే శరణ్యమని పేద, మధ్య తరగతి ప్రజలు బలవన్మరణాలకు పాల్పడుతున్న దయనీయ పరిస్థితి కళ్లముందు కనిపిస్తున్నది. ప్రభుత్వ వైద్యంపై విశ్వాసం లేకపోవడం, ప్రైవేట్ వైద్యం ఖరీదు కావడం, ప్రాణాంతక వ్యాధులపై అవగాహన లేకపోవడంలాంటి కారణాలు వ్యాధిపీడితులను చావు వైపుకు మళ్లిస్తున్నాయి. అందరికీ సార్వత్రిక ఆరోగ్య బీమా అమల్లో ఉంటే ప్రజలకు వైద్యం అందుబాట్లో ఉండేది. కానీ ప్రజలకు ఎక్కడా పూర్తి స్థాయిలో ప్రభుత్వపరంగా బీమా ధీమా లేకపోవడంతో వైద్యం, చికిత్స అనేది జీవన వ్యయాన్ని సవాలు చేస్తున్నది. చికిత్స సంగతి అటుంచితే, కనీసం నివారణ, నిర్ధారణ కూడా చేసుకోలేని పరిస్థితలో మెజారిటీ ప్రజానీకం ఉన్నారు.

వ్యాధులు వచ్చిన తరువాత వారికి చికిత్స ఇవ్వడంకంటే అసలు వ్యాధులు రాకుండా నివారణ చర్యలు చేపట్టడమే ఇప్పుడు కీలకాంశంగా మారింది. వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతోపాటు సకాలంలో రోగ నిర్ధారణ జరిగితే ప్రాణాంతక వ్యాధులతో ప్రాణ నష్టాన్ని నివారించవచ్చు. అనవసర వ్యయాలను అరికట్టవచ్చు. దేశంలో ప్రధానంగా గుండె, క్యాన్సరు, కిడ్నీ, దయాబెటిస్, బి.పి. లాంటి ప్రాణాంతక వ్యాధులపై నివారణ చర్యలు లేకపోవడం నిర్ధారణ సకాలంలో జరగకపోవడంవల్ల ప్రజలే కాకుండా ప్రభుత్వాలు కూడా పెద్ద ఎత్తున చికిత్సకోసం ఖర్చు చేయాల్సి వస్తున్నది. క్యాన్సరు, కిడ్నీ, దయాబెటిస్ లాంటి వ్యాధులకు ప్రజలు జీవితకాలం మందులపై లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఈ వాస్తవ పరిస్థితిని గ్రహించిన కేంద్ర ప్రభుత్వం ఇటీవలే సార్వత్రిక వ్యాధి నివారణ స్క్రీనింగ్ పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం దశల వారిగా దేశంలోని అన్ని ప్రాంతాల్లో అమలవుతుందని కేంద్రం ప్రకటించింది. చాలా కాలం తరువాత కేంద్ర ప్రభుత్వం వ్యాధుల చికిత్స వ్యయాన్ని భరించడంకన్నా ముందుగానే నివారించే, నిర్ధారించే కార్యక్రమాన్ని ప్రకటించడం అందరూ హర్షిస్తున్నారు. పేదరికానికి దిగువన ఉండే ప్రజలకు 40 ఏళ్లు దాటిన తరువాత ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో ప్రాణాంతక వ్యాధుల నివారణ, నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారు.

గతంలో ఈ సేవలకు కూడా ప్రజలు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఈ పరీక్షలకే వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ కొద్దిపాటి ఖర్చును కూడా భరించలేని పేదలు వ్యాధి లక్షణాలు బయట పడినా ఖర్చుకు భయపడి ఆసుపత్రులకు వెళ్లే వారు కాదు. ఇది గమనించిన కేంద్రం కొత్త ఆరోగ్య స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రకటించడాన్ని అన్ని వర్గాల ప్రజలు హర్షిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వమే ప్రజల ఆరోగ్యాన్ని పరీక్షించడానికి ఇలాంటి పథకాలు తీసుకురావడం స్వాగతించదగిన పరిణామమే అని అంతా అంటున్నారు. అయితే ఈ ఉచిత స్క్రీనింగ్ సేవలు ఎంత మందికి అందుతాయి? కార్యక్రమం అమలుతీరు ఎలా ఉంటుంది? అని ఇప్పుడే అంచనా వేయలేని పరిస్థితి ఉంది. అయినా ప్రభుత్వం ఈ మేరకు ప్రకటన చేయడమే ప్రజల ఆరోగ్యంపట్ల ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధను నిరూపిస్తున్నది. ఇప్పటిదాకా కేంద్రం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్య భద్రత కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. ఇవి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఈ విషయంలో ఏకరూపత లేదు. ఇకపై కేంద్రమే ఉచిత స్క్రీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నందున వ్యాధి నివారణ, నిర్ధారణ సులభం కానున్నది.

కేంద్రం ఈ పథకాన్ని ఎన్నికల లేదా ఓట్ల దృష్టితో కాకుండా అమలు చేస్తే ప్రజలకు మరింత విశ్వాసం ఏర్పడుతుంది. ప్రస్తుతం ప్రజలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడితే వాటిని నిర్ధారించుకునే పరీక్షలు చేయించుకోడానికే వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఇవి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరిగ్గా లేవు. ప్రయివేటు ఆసుపత్రుల్లో సేవలు అందుబాట్లో ఉన్నా అవి వారి ఆర్థిక స్థోమతకు తగినట్లుగా అందుబాటులో లేవు. ఫలితంగా కొన్ని పేదవర్గాలు వ్యాధి నివారణ, నిర్ధారణ, చికిత్స లేకుండానే తమ ఖర్మ అంటూ చావులకు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే ఉచిత స్క్రీనింగ్ కొంతమేరకు నివారిస్తుంది. దీనివల్ల ముందే గుండె, క్యాన్సరు, దయాబెటిస్, కిడ్నీలాంటి ప్రాణాంతక వ్యాధుల రాకను ముందే గుర్తించవచ్చు. ఆ తరువాత డాక్టర్ల సూచన మేరకు మందులు వాడితే వ్యాధి ముదరకుండా జాగ్రత్తపడవచ్చు. ఇందుకోసం ప్రభుత్వం ఉచిత ప్రాణాంతక వ్యాధుల నివారణ, నిర్ధారణ కార్యక్రమాన్ని నినాదానికే పరిమితం చేయకుండా విస్తృత స్థాయిలో అన్ని మాధ్యమాల్లో ఈ స్కీము గురించి ప్రచారం నిర్వహించాలి. పరీక్షలకోసం వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా బోధానాసుపత్రుల్లో వ్యాధి నివారణ పరీక్షలు నిర్వహించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు ఏర్పాటు చేయాలి. ఈ కార్యక్రమంతోపాటు ప్రజలకు ఆరోగ్య బీమాపై అవగాహన కల్పించాలి. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఈ ఉచిత పరీక్షల గురించి ప్రచారం చేపట్టాలి. ఈ సందేశం ఎంత మంది పేద వర్గాల ప్రజలకు అందితే అంతగా ప్రాణాంతక వ్యాధులను దానిపై పెట్టే అనవసర ఖర్చును తగ్గించవచ్చు. తద్వారా వ్యాధుల మూలంగా నష్టపోయే ఉత్పత్తిని తగ్గించవచ్చు. ఆ తరువాత చికిత్సకోసం చేసే లక్షల రూపాయలను కూడా ఆదా చేయవచ్చు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఉచిత స్క్రీనింగ్‌ను పకడ్బందీగా చేపట్టాలి. దీనిపై గ్రామస్థాయిలో కూడా దండోరా వేస్తే ప్రజలు పెద్ద ఎత్తున నివారణ, నిర్ధారణ క్యాంపులకు వచ్చే అవకాశం ఉంది. అందరికీ ఈ పరీక్షలు ఉచితంగా అందించే బదులు ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకొని అర్హులను గుర్తిస్తే ఈ కార్యక్రమం మరింత ఆదరణ పొందే అవకాశం ఏర్పడుతుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



ట్రంప్ ఆట మొదలు!

– ఎ.వి.వి. ప్రసాద్

రాజకీయం వేరు, రాజనీతి వేరు. అభ్యర్థిగా ఉన్నపుడు చూసేది రాజకీయమైతే అధికారంలోకి వచ్చాక ఉండవలసింది రాజనీతి. అంటే రాజనీతి తెలిసి మెలగాలి. అన్ని వర్గాల ప్రజలను తనవైపు తిప్పుకొనే చర్యలకు అధికారంలోకి వచ్చిన మొదటి సెకనులోనే శ్రీకారం చుట్టాలి. రాజకీయానికి, రాజనీతికిగల ఆ తేడాను సక్రమంగా తెలుసుకొన్నవారే అధికారంలో ఎక్కువ కాలం కొనసాగగలుగుతారు. ఒబామా మొదటి పర్యాయం అధికారంలోకి వచ్చేసరికి ఆయన ప్రజాదరణ రేటింగ్ 84 శాతమైతే, వ్యతిరేకత 16 శాతమే. కానీ ట్రంప్ అధికారంలోకి వచ్చిన సమయానికి ఆయన ప్రజాదరణ రేటింగ్ అతితక్కువగా 37 శాతమైతే, వ్యతిరేకత 54 శాతం. ఈ పరిస్థితిలో ఆయన తన రేటింగ్‌ను పెంచుకోవాలంటే ప్రజామోద చర్యలు చాలా తీసుకోవలసి ఉంటుంది. కానీ మైనస్ పాయింట్లతో ఆయన పాలన మొదలవడం చూస్తే అది ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందో అనే ఆందోళన కలుగుతుంది...

జాబులన్ని ఇంక స్థానికులకె యంచు
పరుల పొట్టకొట్టు బాటపట్టె
ఆట మొదలుపెట్టె అమెరికా అధినేత
విశ్వవినుత నామ! వినురవేమ!!

అమెరికా కొత్త అధ్యక్షుడుగా ట్రంప్ ఆట మొదలయింది. ఆయన వేసే ప్రతి అడుగును, ఆడే ప్రతి మాటను ప్రపంచ ప్రజలంతా చాలా ఆసక్తిగా గమనిస్తున్నారు. అందుకు ప్రధాన కారణం- ఎన్నికల ముందు, తరువాత కూడా ఆయన అత్యంత వివాదాస్పదుడు కావడమే. ఏడాదిన్నర క్రితం రిపబ్లికన్ అభ్యర్థిగా ఆయన ఎంపికైనప్పుడు, తర్వాత గత నవంబర్‌లో అధ్యక్షుడుగా ఆయన ఎన్నికైనపుడు, ఆ తర్వాత జనవరి 20న దేశ 45వ అధ్యక్షుడుగా ఆయన ప్రమాణం చేసినపుడు... ఈ మూడు ప్రధాన సందర్భాలలో కూడా ట్రంప్‌కు ప్రశంసలకంటె విమర్శలే ఎక్కువగా వినిపించాయి. ఎన్నికల ప్రచార సమయంలో దాదాపు సంవత్సర కాలం ఏ సర్వే ఎవరు జరిపినా దానిలో హిల్లరీ క్లింటన్‌కే ఆధిక్యత లభిస్తూ వచ్చినా ఏ దశలోను వెనక్కి తగ్గే ప్రయత్నం చేయని ట్రంప్ చివరిదాకా తానే అధ్యక్షుడు కాగలననే ఆశాభావమే వ్యక్తం చేశారు. మీడియా సర్వేల్లో హిల్లరీకి కనిపించిన ఆధిక్యతను ఆయన 'హుష్' అంటూ ఎగరగొట్టేవారు. మీడియా అంతా చాలా పక్షపాతంతో వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టేవారు. మీడియాపై ఎప్పుడూ విరుచుకుపడే ధోరణే ఎన్నికైన తర్వాత కూడా ఆయనలో కొనసాగడం కొంత విచారకరమే అయినా, దానివెనుక ఏదో న్యూనతా భావంతో ఆయనలో కనిపిస్తున్నట్లుగా అనిపిస్తుంది. 'నేను ఈ పదవికి తగనేమో.. అందుకే అందరు అంతగా విమర్శిస్తున్నారేమో!' అనే ఆత్మన్యూనత ఆయన వైఖరిలో తరచుగా కనిపించడం, దాని ప్రభావంతో అందరిపై నిప్పులు కురిపించడం అందుకే ఎక్కువవుతూన్నదేమో! అని కూడా అనిపిస్తుంది. అధికారంలోకి వచ్చిన రెండో రోజున మీడియా సమావేశం ఏర్పాటుచేసి 'మీరు నాపై అనవసరంగా బురద జల్లుతున్నారు. ఖాళీ ఉన్న ప్రదేశాలు హైలైట్ చేసి నా ప్రమాణోత్సవానికి ప్రజలు ఎక్కువగా రాలేదని అవాకులు చెవాకులు రాస్తారా! మీరంతా నీతి లేనివాళ్లు' అంటూ తన అక్కసునంతా ప్రదర్శించారు. కానీ ప్రపంచానికంతా తెలుసు. ఎనిమిది సంవత్సరాల క్రితం ఒబామా తొలిసారి అధ్యక్షునిగా ప్రమాణం చేసినపుడు దానిని తిలకించడానికి ఎంతో ఆసక్తితో హాజరైన ప్రజల సంఖ్య 18 లక్షలుపైనే. నాడు టీవీలలో లైవ్ ప్రసారం చూసిన వారెవరికైనా, ప్రింట్ మీడియాలో వార్తలు చదివినవారెవరికైనా ఈ విషయం గుర్తుండే ఉంటుంది. జనవరి 20వ తేదీన వాషింగ్టన్‌లోని నేషనల్ మాల్ సమీపంలో జరిగిన ట్రంప్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రజలు దాదాపు 8 లక్షలు మాత్రమే. అప్పుడు కొన్ని కిలోమీటర్ల మేర జన సాగరం కనిపించింది. ఇప్పుడు నిజంగానే చాలాప్రాంతం ఖాళీగా ఉందనిపించింది. దానిని ఎవరు కాదన్నా అది వాస్తవాన్ని వక్రీకరించడమే అవుతుంది. ట్రంప్ ప్రమాణోత్సవానికి కూడా ప్రజలు పెద్ద ఎత్తునే తరలివచ్చారు. కానీ అది ఒబామాకు వచ్చిన సంఖ్యలో సగంకూడా లేదు. ట్రంప్ అంగీకరించినా, కాదన్నా మీడియా చెప్పే సాక్ష్యం అందరూ ఒప్పుకొనవలసిందే. ఆయన



ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో ఉన్న అభ్యర్థి కాదు. వైట్‌హౌస్‌లో అధికారికంగా ఉన్న కొత్త అధ్యక్షుడు. ప్రపంచమంతా ఆయన అడుగుల వైపే చూస్తున్నపుడు అగ్రశ్రేణి మీడియా ప్రతినిధులందరిని పిలిచి 'మీరు నీతిలేనివాళ్లు' అంటూ నిందిస్తే అది ఎలా సమర్థనీయమవుతుంది! ఎన్నికల ప్రచారంలో ఆయన ఎవరిని ఎలా దూషించినా అప్పుడు అందరు ఒక 'అభ్యర్థి'గా మాత్రమే ఆయన్ని చూశారు. కానీ ఇప్పుడాయన ప్రపంచానికి జవాబీయవలసిన అమెరికా అధ్యక్ష స్థానంలో కూర్చున్నారు. వైఖరిలో మార్పు వస్తే ఆయనకే గౌరవం పెరుగుతుంది.

ఒక పార్టీ ప్రభుత్వం మారిన తర్వాత మరో పార్టీ చేతికి అధికార పగ్గాలు చిక్కితే సహజంగా కనిపించే పరిణామాలే ట్రంప్ పదవీ స్వీకారం తర్వాత కూడా కనిపిస్తున్నాయి. 'అమెరికా ఫస్ట్' నినాదంతో ప్రమాణ స్వీకార క్షణంనుంచే తన ఉద్దేశాన్ని స్పష్టంగా చాటిన ట్రంప్ గత ప్రభుత్వ నిర్ణయాలపై సమీక్ష మొదటిరోజునుంచే ప్రారంభించడం గమనించవలసిన అంశం. ఇంతకుముందు ఉన్నది డెమొక్రాట్ ప్రభుత్వం గనుక, రిపబ్లికన్ అధ్యక్షుడుగా ట్రంప్ తన విధానాలను అనుసరించడంలో తప్పులేకపోయినా, అంతకుముందు ఎంతో ప్రజాదరణ పొంది ఉన్న పథకాలపై తొలిరోజునే వేటు మొదలు పెట్టడం చూస్తే ఆయన 'దూకుడు' ముందుముందు ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో అనిపిస్తుంది. ఆయన మొదటి సంతకం చేసింది 'ఒబామా కేర్'లో మార్పులపైనే. కొన్ని సంవత్సరాలపాటు ఒబామా ఆలోచించి ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం ఆ పథకాన్ని దేశమంతా అమలు చేయడం ప్రారంభించారు. అప్పట్లోనే రిపబ్లికన్లు అడుగడుగునా దానిని అడ్డుకున్నా, తన 'మాస్టర్ స్కీమ్'గా ఒబామా ధైర్యం చేసి దానిని అమలులోకి తెచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన మొదటిరోజునే ట్రంప్ ఆ పథకాన్ని ఆవిరిచేసే చర్యలు ఆరంభించారు. ఇది కొంచెం ఆలోచించవలసిన విషయమే. 'అందుబాటులో ఆరోగ్య రక్షణ' పేరుతో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ చట్టాన్ని అమలులోకి తేవడంద్వారా అప్పట్లో ఒబామా తన ప్రజాదరణ రేటింగ్ 20 పాయింట్లు పెంచుకొన్నారు. కానీ ఇప్పుడు దానిని ప్రజలకు దూరం చేయడంద్వారా మొదటి మైనస్ పాయింట్లను ట్రంప్ సాధించుకొన్నారనిపిస్తుంది. వైట్ హౌస్‌లోని ఓవల్ ఆఫీసులోకి అడుగు పెట్టిన

గంటలోనే ట్రంప్ ఇలాంటి 'ఒబామా వ్యతిరేక చర్యలు' ఆరంభించడాన్ని చూస్తే తన అధికార కాలంలో ఎక్కువ భాగం ఇలాంటి 'రద్దు'ల పైనే దృష్టి కేంద్రీకరించడానికే ఆయన కేటాయిస్తారేమో! అనిపిస్తుంది.

****

రాజకీయం వేరు, రాజనీతి వేరు. అభ్యర్థిగా ఉన్నపుడు చూసేది రాజకీయమైతే అధికారంలోకి వచ్చాక ఉండవలసింది రాజనీతి. అంటే రాజనీతి తెలిసి మెలగాలి. అన్ని వర్గాల ప్రజలను తనవైపు తిప్పుకొనే చర్యలకు అధికారంలోకి వచ్చిన మొదటి సెకనులోనే శ్రీకారం చుట్టాలి. రాజకీయానికి, రాజనీతికిగల ఆ తేడాను సక్రమంగా తెలుసుకొన్నవారే అధికారంలో ఎక్కువ కాలం కొనసాగగలుగుతారు. ఒబామా మొదటి పర్యాయం అధికారంలోకి వచ్చేసరికి ఆయన ప్రజాదరణ రేటింగ్ 84 శాతమైతే, వ్యతిరేకత 16 శాతమే. కానీ ట్రంప్ అధికారంలోకి వచ్చిన సమయానికి ఆయన ప్రజాదరణ రేటింగ్ అతితక్కువగా 37 శాతమైతే, వ్యతిరేకత 54 శాతం. ఈ పరిస్థితిలో ఆయన తన రేటింగ్‌ను పెంచుకోవాలంటే ప్రజామోద చర్యలు చాలా తీసుకోవలసి ఉంటుంది. కానీ మైనస్ పాయింట్లతో ఆయన పాలన మొదలవడం చూస్తే అది ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందో అనే ఆందోళన కలుగుతుంది.

నిజానికి గతంలోని అందరు అధ్యక్షులకంటె చాలా తక్కువ ప్రజామోద రేటింగ్‌తో ట్రంప్ పాలన మొదలైనట్లు కనిపిస్తుంది. ఒబామాకు ముందు జార్జి బుష్‌కు 62/ 36 రేటింగ్ ఉంగా, ఆయనకు ముందు బిల్ క్లింటన్‌కు 68/20 రేటింగ్ మొదలయింది. అలాగే వారికి ఇంకా ముందు సీనియర్ బుష్‌కు 66/ 19, రొనాల్డ్ రీగన్‌కు 58/ 18 రేటింగ్ నమోదయింది. దీన్నిబట్టి చూస్తే అతి తక్కువ ప్రజాదరణ రేటింగ్‌తో మొదలయింది ట్రంప్ పాలనే అన్నది స్పష్టమవుతుంది. ఆయనకు రేటింగ్ అంత తక్కువగా ఉండడానికి కారణం 'ఈయన సమర్థంగా పాలన సాగించగలడా?' అనే అభిప్రాయం ఎన్నుకొన్న వారిలో సైతం అధికంగా ఉండడమే. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటినుంచి ట్రంప్ చేసిన వివాదాస్పద ప్రకటనలు, చర్యలు ప్రజలలో ఆయనపై అనుమానం పెంచడానికే కారణమయ్యాయిగాని, ఆయన సామర్థ్యాన్ని నిరూపించడానికి కాలేక పోయాయి. ట్రంప్ పదవీ స్వీకార సమయంలో అమెరికాలోని ప్రముఖ మీడియా సంస్థలు చేసిన సర్వేల ప్రకారం అంతర్జాతీయ సంక్షోభాల పరిష్కారం విషయంలో ఆయన సమర్థంగా వ్యవహరించ గలుగుతారా? అనే ప్రశ్నకు 30 శాతం మంది మాత్రమే పాజిటివ్‌గా జవాబిచ్చారట. అలాగే సైనిక శక్తిని ఆయన తెలివిగా ఉపయోగించు కోగలరా? అనే ప్రశ్నకు 37 శాతం మంది మాత్రమే పాజిటివ్ సమాధానమిచ్చారు. ఇక దేశీయంగా పాలనను ఎంత సమర్థంగా అందించగలుగుతారనే ప్రశ్నకు దాదాపు 47 శాతం మంది పాజిటివ్ సమాధానమిచ్చారని వాషింగ్టన్ పోస్టు తెలిపింది. దీన్నిబట్టి చూస్తే ఆయన ప్రజామోద రేటింగ్ ముందు ముందు ఏ విధంగా నడుస్తుందో తేలికగానే అర్థమవుతుంది.

అన్నిటికంటె ముఖ్యంగా ప్రమాణోత్సవంలో ఆయన మొదటి మాట అయిన 'అమెరికా ఫస్ట్...' ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. 'ఇతర దేశాల వారికి అమెరికాలో హెచ్-1బి వీసాలు ఇచ్చి పనులు చేయించుకోవడం దేనికి? మన దేశంలోని వర్సిటీలో చదువుకొన్నవారికే ప్రాధాన్యం ఇద్దాం. అమెరికన్లకోసమే అమెరికా అంటూ ఆయన ఎంతో ఉద్వేగంతో చేసిన ప్రసంగం అనేక దేశాలకు చెందిన విద్యార్థులు, ఉద్యోగుల గుండెల్లో ప్రకంపనలు కలిగిస్తోంది. ఇప్పటిదాకా అమెరికాలోని స్థానికులు తీవ్రంగా నష్ట పోయారనీ, ఫ్యాక్టరీలు, కంపెనీలు మూతపడి స్థానికులు ఉద్యోగా లను కోల్పోయారనీ, అదువల్ల మన ఉద్యోగాలు మనమే చేద్దామనీ ఆయన అంటున్నపుడు కొన్ని వర్గాల నుంచి అనుకూల స్పందనే లభించినా, అధికశాతం మంది నుంచి ముందు ముందు చాలా వ్యతిరేకత కనిపించే అవకాశమే ఉంది అన్ని పనుల్లో కార్మికుల నుంచి ఇంజినీర్ల వరకు అందరిని అమెరికన్లనే ఉపయోగించుకొంటా మని ట్రంప్ చెబుతున్న మాట వినడానికి ఆకర్షణీయంగానే ఉన్నా అమెరికాలోని మౌలిక వసతుల దృష్ట్యా అది అంత తేలికైన విషయం కాదని గతంలోనే పలుమార్లు స్పష్టమైంది. ఆ కారణంగానే హెచ్-1బి వీసాలిచ్చి లక్షల సంఖ్యలో ఇతర దేశాలకు చెందిన నిపుణులను అమెరికాలో ఉపయోగించుకొంటున్నారు. స్థానిక నినాదం వినడానికి బాగానే ఉన్నట్లనిపించినా, అది అమెరికాకు అనుకూలించని విధాన మేనన్నది గమనించాలి. పైగా ట్రంప్ సహజంగానే డబ్బుని ఒకటికి పది రెట్లు చేయగల వ్యాపారవేత్త. డాలరు పెట్టుబడి పెడితే 100 డాలర్లు సంపాదించాలనే ఆలోచనగల మనిషి. అటువంటి వ్యాపార నీతి తెలిసిన ట్రంప్ తన గోతిని తానే తవ్వుకొంటాడా? అన్నదే సందేహం. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలతో గల వాణిజ్య ఒప్పందా లనూ సమీక్షిస్తానని ట్రంప్ అంటున్నారు. ఇది కూడా అనుమానించ వలసినదే. ఎందుకంటే అమెరికా వాణిజ్యమంతా భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. అటువంటప్పుడు ఆ దేశాలను నిర్లక్ష్యం చేస్తే అమెరికాకు లాభంకంటే నష్టమే ఎక్కువ కలుగుతుంది. వ్యాపారవేత్త అయిన ట్రంప్ దేశానికి నష్టంకలిగించకపోవచ్చనే అనుకోవాలి. అధ్యక్షుడుగా ట్రంప్ తొలి పలుకుల్లో కొన్ని ఆయన అమెరికాకుగాక మరో దేశానికి అధిపతి అయి ఉంటే చాలా ప్రశంసలను అందుకొని ఉండేవనిపిస్తుంది. ఇంత కాలం సొంత మిలటరీని నిర్లక్ష్యం చేసి విదేశీ సైన్యానికి సబ్సిడీలు ఇచ్చారనీ, సొంత సరిహద్దులను వదిలివేసి ఇతర సరిహద్దులకు కాపలా కాశారనీ, అనేక దేశాలకు సైన్యాలను పంపి ఆర్థికంగా అమెరికా చితికిపోయేట్లు చేశారనీ తన తొలి ప్రసంగంలో ఎక్కువ భాగం గత అధ్యక్షులపై ముఖ్యంగా ఒబామా విధానాలపై విరుచుకు పడడానికే ఆయన ప్రాధాన్యమిచ్చారు. వాటిని పరిశీలిస్తే ప్రపంచంలో అమెరికా బాధ్యతలేమిటో వాటిని ఆయన అంతగా పట్టించుకొన్నట్లు లేదనే అనిపిస్తుంది. అమెరికా తీసుకొనే ప్రతి సైనిక చర్య సమర్థనీయం కాకపోయినా, అమెరికా సేనలు ముందుండి కదలకపోతే కొన్ని సందర్భాలలో ప్రపంచంలో తీవ్ర సంక్షోభం తలెత్తే అవకాశం కూడా ఉంటూంటుంది. 'అమెరికా' అనే పెద్దన్న కర్ర పట్టుకొని నించున్నట్లు కనిపించకపోతే చాలా ఉగ్రశక్తులు చాలా దేశాలను కబళించే ప్రమాదం కూడా ఉంది. అమెరికా తనను తాను రక్షించుకోవడంతోపాటు సమస్య తలెత్తితే మరో దేశానికి బాసటగా కూడా నిలబడవలసి ఉంటుంది. అందుకోసం మిలటరీ పరంగా అనేక ఇతరదేశాలకు లేని భారం అమెరికాపై పడుతూంటుంది. అమెరికా భయం లేకపోతే చైనా ఈపాటికి ఎన్ని దేశాలను తన గుప్పెట్లోకి తెచ్చుకొని ఉండేదోకదా! అంతమాత్రంచేత అమెరికా దుర్మార్గపు చర్యలనూ సమర్థించవలసిన అవసరం లేదు. అమెరికా విషయంలో తప్పక 'సమతూకం' పాటించవలసి ఉంటుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ అమెరికా అవసరాలు, బాధ్యతలకోణంనుంచి ఆలోచించి తన తొలి ప్రసంగంలో మాట్లాడి ఉంటే ఆ మాటలు మరింత బాధ్యతాయుతంగా కనిపించి ఉండేవనిపిస్తుంది.

ఈ భూమిమీద నుంచి ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని తుదముట్టిస్తా మనడం కూడా కొంచెం నవ్వు తెప్పించేదిగానే కనిపిస్తుంది. ఎందు కంటే ఉగ్రవాదం ఊడలు పెంచుకొనడానికి కారణమైన దేశాలలో అమెరికా కూడా ఉన్నది గనుక. ప్రకటనల పరంగా మాత్రమే ట్రంప్ మాటలు బాగుంటాయిగాని ఆచరణలో అవి చాలా కష్టసాధ్యమే అనిపిస్తాయి.

అందుకే ట్రంప్ ఇక తాను రాజకీయ నేతగా గాక అమెరికా అధినేతగా, అన్ని విషయాలు తెలిసిన రాజనీతిజ్ఞుడుగా మాట్లాడితే ముందు ముందు రేటింగ్ పెరిగి కనీసం నాలుగేళ్లయినా మంచి మార్కులతో పాలన సాగించడం సాధ్యమవుతుంది. మెక్సికో గోడ వంటివి ఇంకా ఆయనను నవ్వులపాలు చేస్తూనే ఉన్నాయి. ముందు ముందు తాను నవ్వులపాలు కాకుండా అందరి ముఖాలలో నవ్వు కనిపించే విధంగా ట్రంప్ నడుస్తారనే అనుకోవాలి.



పసి బతుకులు మసి!

ఇదీ బాలభారతం..

కవర్‌స్టోరీ

పెట్ల వెంకటేశం

'నేటి బాలలే రేపటి పౌరులు' అని పదేపదే ఉటంకిస్తూ ఉంటాం. కానీ రేపటిపౌరులైన బాలల స్థితిగతులపై దృష్టి నిలిపినపుడు భావిభారత చిత్రం మనల్ని భయపెడుతుంది. కారణం ఎందరో బాలలు సర్వత్రా కార్మికులుగా కనిపించడమే. ఎందెందు వెదకి చూసిన కాదు, వెదకకపోయినా కళ్లెదుటే ప్రత్యక్షమవుతుంటారు బాలకార్మికులు. హోటళ్లలో సర్వర్‌లుగా, కప్పులు కడుగుతూ, పార్క్‌ల వద్ద పల్లీలమ్ముతూ, ఫ్యాక్టరీలలో, అనేకానేక పరిశ్రమలలో, ఇటుకబట్టీలలో, ఆఖరుకు ప్రమాదకరమైన టపాసుల తయారీసంస్థలలో, ప్రాణాంతకమైన గనులలో ఇలా ఎన్నెన్నో పనులలో ఎందరెందరో చిన్నారులు...పాలుగారే బుగ్గలు మసిబారిపోయి.. బంగారు బాల్యాన్ని కోల్పోయి బండచాకిరీకి అంకితమై ఆటపాటలకు, చదువుకు, ఆత్మీయుల ఆలనపాలనకు, కాసిన్ని నవ్వులకు దూరంగా..బక్కచిక్కిన దేహాలతో ఈసురోమంటూ బతుకు లీడుస్తూ...వారి బతుకుల్లో వెలుగులు నిండేదెలా? రేపటిపౌరులు ఇలాంటి దుస్థితిలో ఉంటే భావిభారతం ఉజ్జ్వలంగా ఉండేదెలా? భారత్‌లోని బాలకార్మిక వ్యవస్థ స్వరూపం, సంబంధిత చట్టాలు, వాటి అమలుతీరు తదితర అంశాలు ఈవారం మీకోసం..

ఇటీవల కేంద్రప్రభుత్వం 1986లో బాలకార్మిక నిషేధం, నియంత్రణ చట్టాన్ని అమలులోకి తెచ్చింది. 14 ఏళ్లలోపు పిల్లలను ప్రమాదకర పనుల్లో వినియోగించడం ఈ చట్టం ప్రకారం నిషేధం. అయితే ఈ చట్టంలో అనేక సవరణలు చేసి ఇటీవలే కొత్త చట్టాన్ని అమలులోకి తెచ్చారు. ఇందులో 14-18 ఏళ్ల మధ్య వయసు పిల్లలను చేర్చారు. ప్రమాదరహిత కుటుంబ వృత్తులు, వ్యాపారాలు, వ్యవసాయ పనులూ పిల్లలు చేయడానికి ఈ చట్టం అవకాశం కల్పిస్తోంది. చట్ట సవరణ ద్వారా కౌమారదశ పిల్లలను ప్రమాదకర పనుల్లో పెట్టకూడదని చెపుతున్న ప్పటికీ, ఆ ప్రమాదకర పనుల జాబితాను బాగా కుదించడం చర్చనీయాంశం అవుతోంది. ప్రమాదకర పనుల జాబితాలో ఇదివరకు 83 ఉండగా ఇప్పుడు వాటిని 31కి కుదించారు. ప్రమాదకర ప్రక్రియలుగా గనులు, మండేపదార్థాలు, ఫ్యాక్టరీల చట్టం కింద ప్రమాదరకమైన రంగాలుగా పరిగణించగా, కార్పెట్, జరీ, బీడీ, మైకా, వజ్రాలకోత, పారిశుద్ధ్యం, ఇటుక బట్టీలు, పొలంపనులు మొదలైన పనులు ప్రమాదరహిత జాబితాలో చేర్చారు. ఈ కొత్త చట్టం ప్రకారం ఇంటి చాకిరీ నుంచి వ్యవసాయ పనుల వరకు పిల్లలను నిర్భయంగా వినియోగించుకోవచ్చు, అయితే 18 ఏళ్లలోపు వారిని ఎవరినైనా పనికి వినియోగిస్తే అరెస్టు చేసే హక్కు ఉంటుంది. 6 నెలలనుంచి 2 ఏళ్లవరకు శిక్ష పడవచ్చు. అలాగే 20వేల నుంచి 50 వేల వరకూ జరిమానా విధించవచ్చు. బడికి వెళ్లివచ్చే పిల్లలను సెలవుల్లో కుటుంబ వ్యాపారాలు, వృత్తుల్లో, వ్యవసాయ పనుల్లో



వినియోగించుకోవచ్చు. అయితే ఇంటివద్ద పిల్లలు చదువుకోడానికి కానీ హోంవర్కు చేయడానికి కానీ వీలు కుదరకపోవచ్చు.


అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎస్‌ఒ) 138 వ నిబంధన ప్రకారం 2010లో విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చింది. 14 ఏళ్ల వరకు పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత విద్య అందించాలని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. రాజ్యాంగంలోని 21-ఎ అధికరణం కింద జీవించే హక్కుతో సమానంగా విద్యాహక్కుకూ చట్టబద్ధ ప్రతిపత్తి కల్పిస్తోంది. 14 ఏళ్ల వరకు ఉచితంగా ప్రాథమిక విద్య పొందడం దేశంలోని బాలల హక్కుగా 1993లో ఉన్నిక్రిష్ణన్ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పేర్కొంది. బాలల నిర్బంధ ఉచిత విద్యా హక్కు చట్టం 2010 ఏప్రిల్ 1న అమలులోకి వచ్చింది. మరి అలాంటప్పుడు సవరించిన బాల కార్మిక నియంత్రణచట్టం విద్యాహక్కు చట్టానికి ఏవిధంగా ఆసరా ఇస్తుందో చెప్పలేం. దేశంలో పౌష్టికాహార లేమితో 48 కోట్లమంది పిల్లలు వ్యాధుల బారిన పడుతున్నారు. కొత్తచట్టం ప్రకారం కులవృత్తుల్లో పిల్లలు రోజులు గడిపితే చదువు వారికి ఏవిధంగా అబ్బుతుందన్నది ప్రశ్నార్థకం. కులవృత్తుల్లో పిల్లలు పని చేయడంవల్ల తాత్కాలికంగా ఆయా కుటుంబాలకు కొంత ప్రయోజనం కలుగు తున్నా భవిష్యత్తులో వారికి మంచి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఎలా వస్తుంది? తక్కువ వేతనాలకే పిల్లలు ఎవరివద్దనైనా పనిచేస్తుంటారు. అలాగే పనులకోసం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న పిల్లలు ఎక్కువగానే పట్టుబడుతున్నారు.

ఇటువంటి పిల్లల్లో దళితులు, గిరిజనులు, వెనుకబడినవారే అధికశాతంమంది ఉంటున్నారు.

5 నుంచి 17 ఏళ్ల వయసు బాల కార్మికులు ప్రపంచం మొత్తం మీద 16.8 కోట్లమంది వరకు ఉన్నారు. ఒక్క మన భారతదేశంలోనే 57 లక్షల మంది వరకు ఉన్నారని అంచనాగా తెలుస్తోంది. వీరిలో సగంమంది వ్యవసాయరంగంలో, నాలుగో వంతుమంది ఎంబ్రాయిడరీ, కార్పెట్లు, అగ్గిపెట్టెల తయారీ, హోటళ్ల, ఇంటిచాకిరి వంటి పనులు చేస్తున్నారు. పేదరికం వల్ల చదువుకోలేని పిల్లలను పాఠశాలలకు రప్పించాలన్న లక్ష్యంతో రెండు దశాబ్దాల క్రితం మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైంది. దాదాపు 12.70 లక్షల పాఠశాలల్లో 14 కోట్లమందికి పైగా ఈ పథకం వర్తిస్తోంది.

అలాగే డిపెప్ వంటి పథకాలను కలగలిపి సర్వశిక్షా అభియాన్ ప్రవేశపెట్టారు. నిర్భయ కేసు అనుభవం దృష్ట్యా బాలనేరస్థుల్లో పరివర్తన తీసుకు రావడానికి ప్రయత్నిస్తు న్నారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు 17 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు నెలకొల్పాలని 15 ఏళ్లక్రితం సర్వోన్నత న్యాయస్థానం సూచిం చింది. పౌష్టికాహార పంపిణీ ద్వారా మాతాశిశు మరణాలను తగ్గించడంతోపాటు పిల్లలకు, మాతృత్వానికి ఊరట కల్పించ డానికి 1975లో సమగ్రశిశు అభివృద్ధి పథకం ప్రారంభించారు. ఆరేళ్ల లోపు పిల్లలు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు వీరందరికీ విధిగా పౌష్టికాహారం అందించాలని సర్వోన్నత న్యాయస్థానం 2004లో ఆదేశించింది.

కిడ్నాప్ చేసిన పిల్లలను వెట్టిచాకిరీ, భిక్షాటనలోకి, మాదక ద్రవ్యాల సరఫరా, విక్రయాలు వంటి ఘోరాలకూ వినియోగించడం జరుగుతోంది. బాలలపై లైంగిక వేధింపులు నిరోధించడానికి 2012లో పోక్సో చట్టం అమలులోకి వచ్చింది.



ఉత్తర ప్రదేశ్‌లో 2.1 మిలియన్, బీహార్‌లో 1.0 మిలియన్, రాజస్థాన్‌లో 0.84 మిలియన్, మధ్యప్రదేశ్ లో 0.7 మిలియన్, మహారాష్ట్రలో 0.72 మిలియన్ బాలకార్మికులు ఉన్నారు.



బాలకార్మిక వ్యవస్థ ఉనికి ఇప్పుడు మారుతోంది. ఫ్యాక్టరీల నుంచి వ్యాపారవేత్తలు, కార్మిక నాయకుల ఇళ్లకు ఇది స్థానం మార్చుతోంది. ప్రమాదకర పనుల్లో కిశోర బాలలు భారత్‌లో 2.4 మిలియన్లు, పాకిస్థాన్‌లో 1.3 మిలియన్లు, ఇండోనేసియాలో 1.2 మిలియన్ల మంది పనిచేస్తున్నారు. భారత్‌లో ఈ కిశోర బాలల్లో రెండింట మూడొంతుల మంది బాలకార్మికులే. గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం మంది బాలకార్మికులు ఉన్నారు. ప్రతి నలుగురిలో ముగ్గురు వ్యవసాయం, ఇంటి పనుల్లో చాకిరీ చేస్తున్నారు. 14 ఏళ్లలోపు పిల్లలు 21 శాతం మంది తమ తల్లిదండ్రులు, బంధువులతో కలిసి పనులు చేస్తున్నారు. అలాగే 14 ఏళ్లనుంచి 17 ఏళ్లలోపు వారిలో 19శాతం మంది ఉన్నారు. వెట్టి చాకిరీ చేసే పిల్లల్లో ఢిల్లీలో 14 ఏళ్లలోపు పిల్లలను 83 శాతం మందికి ఆ వెట్టి చాకిరీనుంచి విముక్తి కల్గించారు. గార్మెంట్ (జరీ), జూట్, ప్లాస్టిక్, రెసిన్, వస్త్రాలు, బూట్లు, చెప్పులు, హోటల్, దాబాల పరిశ్రమల్లో 50శాతం మంది పిల్లలే పనిచేస్తున్నారు. వీరిలో 55శాతం మంది పిల్లలను రక్షించగలిగారు. జువెనైల్ జస్టిస్ కింద 42శాతం కేసులు (14 ఏళ్లలోపు పిల్లలకు), 14-17 ఏళ్ల వయసు పిల్లలకు సంబంధించి 33 శాతం కేసులు నమోదయ్యాయి. 14 ఏళ్లలోపు పిల్లలను వేరే ప్రాంతాలకు తరలిస్తున్న సంఘటనకు సంబంధించి 10శాతం కేసులు నమోదయ్యాయి. 14-17 ఏళ్ల పిల్లల అక్రమరవాణాలో 14 శాతం కేసులు, నిర్బంధంగా పని చేయించే నిబంధనలకు సంబంధించి 27 శాతం కేసులు నమోదయ్యాయి.

రాజ్యాంగ రక్షణలు

ఆర్టికల్ 15 (3) మహిళలు, బాలల సంక్షేమం, ఆర్టికల్ 21 (ఎ) 6-14 ఏళ్ల పిల్లలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య అందించడం, ఆర్టికల్ 23 (1) ప్రకారం బాలలను అమ్మడం, కొనడం, వారిచే భిక్షాటన చేయించడం నేరం. ఆర్టికల్ 24..14 ఏళ్ల లోపు పిల్లలను ప్రమాదకర పనిలో పెట్టుకోవడం నిషిద్ధం. ఆర్టికల్ 39-ఇ ప్రకారం బాలకార్మిక ఆరోగ్యం, శ్రమ

ఆత్మాహుతి బాంబులుగా పాపం పసివాళ్లు..

నైజీరియా ఈశాన్య ప్రాంతాల్లో, పొరుగుదేశాల్లో 2015లో 44మంది పసివాళ్లను ఉగ్రవాదులు ఆత్మాహుతి బాంబులుగా వినియోగించే పాశవిక సంఘటన జరిగింది. వీరిలో నాలుగింట మూడు వంతుల మంది బాలికలు 2014 జనవరి నుంచి 2016 ఫిబ్రవరి వరకు 40 బాలల ఆత్మాహుతి బాంబుల దాడులు జరిగాయి. రెండేళ్ల క్రితం బొకోహరామ్ మిలిటెంట్లు స్కూళ్లకు వెళ్లి చదువుకొంటున్న బాలికల్లో 276 మందిని బిబోక్, నైజీరియాలో కిడ్నాప్ చేశారు. వారిని ఎలాగోలా నమ్మించి మృత్యుక్రీడకు వినియోగించుకున్నారు. బొకోహరామ్ హింసాకాండ ప్రారంభించిన తరువాత 1800 స్కూళ్లు మూతపడ్డాయి. వీటిలో చాలా స్కూళ్లు




శిథిలమయ్యాయి. కొన్ని స్కూళ్లు లూటీకి గురయ్యాయి. కొన్ని తగులబడ్డాయి. అంతకుముందు ఈ స్కూళ్లన్నీ శరణార్థుల నివాసాలుగా ఉండేవి. ఈ శరణార్థులకు చెందిన 5వేల మంది పిల్లలు తల్లిదండ్రులకు దూరమయ్యారు.

దుర్వినియోగం కారాదు. ఆర్టికల్ 39 ఎఫ్ ప్రకారం బాలల నేరాలలో, చెడు అలవాట్లకు పాల్పడకుండా చూడాలి. ఆర్టికల్ 45 ప్రకారం 6 ఏళ్ల బాలలకు ఆరోగ్య పరిరక్షణ, విద్యా వసతులు కల్పించాలి. ఆర్టికల్ 46 ప్రకారం బాలల విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఆర్టికల్ 47 ప్రకారం పౌష్టికా హారం అందించాలి, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలి.

జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లోని మైకా గనుల్లో కనీసం 20 వేలమంది బాలకార్మి కులు పనిచేస్తున్నారని అంతర్జాతీయ కార్మిక వ్యవస్థ అంచనాగా చెపుతోంది. బ్రిటిష్ కాలంలో, తరువాత సింథటిక్ ప్రతిక్షేపాలు కనుగొనడానికి ముందువరకూ కూడా మైకా షీట్లకు చాలా డిమాండ్ ఉండేది. ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ పరిశ్రమల్లో ఇప్పటికీ చాలా వస్తువుల తయారీకి మైకా వినియోగిస్తుం టారు. ఆటోమొబైల్ పరిశ్రమల్లో దీన్ని అనేక రకాలుగా ఉపయోగిస్తుంటారు. అయితే ఈ మైకా గనులు అడవుల్లో విస్తరించడంతో ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ నిబంధనల ప్రకారం ఈ గనుల వినియోగంపై ఆంక్షలు విధించా రు. 1980 ప్రాంతంలో ప్రభుత్వం అనేక మైకా గనులను మూసివేయించింది. అయినా దీని డిమాండ్ తగ్గలేదు. ఫలితంగా అక్రమ మైకా గనుల సామ్రాజ్యం సాగుతోంది. ప్రమాదకరమైన మైకాగనుల్లో ఎంతమంది బాలక ార్మికులు చనిపోయారో ఆధారాలు లేవు. అయితే మైకా గనుల మరణాల్లో 10శాతం వరకు పోలీస్ స్టేషన్‌లో నమోదవుతున్నాయని బచ్‌పన్ బచావో ఆందోళన్ అనే సేవాసంస్థ చెపుతోంది. గతజూన్ వరకు నెలనెలా 20మంది బాలకార్మికులు ఈ గనుల్లో మృతిచెందారని వెల్లడించింది. అలా చనిపోయిన పిల్లల తల్లిదండ్రులకు అందే నష్టపరిహారం చాలా స్వల్పం. ఇందులో పనిచేసే పిల్లలు చర్మవ్యాధులకు, శ్వాసకోశ



వ్యాధులకు గురవుతున్నారు. చాలా కుటుంబాలు తమ పిల్లలను గనుల్లో పనికి బలవంతంగా పంపు తున్నారు. పన్నెండేళ్ల ప్రతిభ గనిలో పని చేస్తోంది. తమ కుటుంబంలోని పెద్దలతో పాటు తాను ఈపని



చేస్తున్నట్లు చెప్పింది. నాలుగేళ్ల కిందటే బడిమానేసింది. రోజుకు 50 రూ.నుంచి 75 రూ.వరకు సంపాది స్తోంది. ఈ గనుల్లో 6,000మంది బాలలు పనిచేస్తున్నారు.బడిలో చేర్పించినప్పటికీ చాలామంది బడి మానేసి గనుల్లో పనికి వెళ్తున్నారని కోడెర్మాలోని చైల్డ్‌లైన్‌కు చెందిన ఇంద్రమూర్తి సాహు చెప్పారు.

అంతర్జాతీయ కార్మిక నిర్వహణ వ్యవస్థ వివరాల ప్రకారం జార్ఖండ్, బీహార్ మైకాగనుల్లో 20వేలమంది పిల్లలు పనిచేస్తున్నారు. బాలికలకన్నా బాలురనే ఎక్కువగా పనికి తీసుకుంటారు. ఎందుకంటే గనుల్లో ఇరుకు ప్రదేశాల్లోకి చొరబడేలా వారి శరీరం ఉంటుంది. ఎలాంటి రక్షణ, భద్రత సరంజామా లేకుండా గనుల్లోకి చొచ్చుకుపో తుంటారు. 8 గంటల పాటు గనుల్లోనే ఉంటారు. సుత్తులతో మైకా ముక్కలను వేరుచేస్తుంటారు. ప్రతినెలా కనీసం 10 మంది పిల్లలైనా గనుల్లో చనిపోతుంటారు. అయితే నష్టపరిహారం మాత్రం చాలా తక్కువగా వారి తల్లిదండ్రు లకు కాంట్రాక్టర్లు, కంపెనీలు నుంచి రహస్యంగా అందుతుంది. ఈ గనుల్లో దుమ్మువల్ల అక్కడ పనిచేసే పిల్లల్లో చర్మ వ్యాధులు, శ్వాసకోశవ్యాధులు రావడం మామూలే.

ఇక తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో ఇటుకల బట్టీల్లో పనిచేసేవారిలో ఒడిషా నుంచి వలస వచ్చినవారే ఎక్కువ. 167మంది పిల్లలు ఈ ఇటుక బట్టీల్లో పనిచేస్తు న్నారు. వీరిలో 50శాతం మందిని తిరిగి ఇళ్లకు పంపించే శారు. పెద్దపల్లి జిల్లా రాఘవపూర్ గ్రామం ఇటుక బట్టీలలో ఐదేళ్ల బాలిక రుక్మి స్కూలుకు వెళ్లికూడా తల్లిదండ్రులకు సాయంగా చిన్న పనులు చేస్తోంది. ఆపరేషన్ స్మైల్, ఆపరే షన్ ముస్కాన్ ప్రతిఆరునెలలకు అధ్యయనం నిర్వహి స్తుంటాయి. ఈ ఇటుక బట్టీలనుంచి బాల లకు విముక్తి కల్పించడమే వీరి లక్ష్యం. పిల్లల్లో 50శాతంమందిని బాలకార్మిక విధానం నుంచి తప్పించగలిగారు.

తల్లి దండ్రులను గట్టిగా మందలించి

బాల కాటి కాపరి

ఢిల్లీకి చెందిన 13 ఏళ్ల మొహమ్మద్ ఇలియాస్ ఢిల్లీలోని ఓ స్మశానవాటికలో పనిచేస్తూ కుటుంబ పోషణకు ఉపయోగపడుతు న్నాడు. 6 నెలల క్రితం తన తండ్రి చనిపోవడంతో వేరే దారిలేక తన తండ్రిలాగే స్మశానంలో శవాలు పూడ్చిపెట్టడం, దహనం చేయడం వంటి పనులు చేస్తున్నాడు. భావనా పోలీస్ కాలనీలో వీరి కుటుంబం ఉంటోంది. నెలకు రూ.2వేలు సంపాదించి, కుటుంబాన్ని ఆదుకుంటున్న ఇలియాస్ 8వ తరగతి వరకే చదువుకున్నాడు. ఇంకా చదువుకోవడానికి ఇష్టంలేదని, కుటుంబాన్ని పోషించడమే ఇప్పుడు తన పని అని ఇలియాస్ చెప్తాడు.

ఇటుక బట్టీ పనిలో బుడతడు..

వారణాసిలోని లక్షాపూర్‌లో ఇటుకల బట్టీలో పనిచేస్తున్న 12 ఏళ్ల సోను వెయ్యి ఇటుకలు పోతపోసినందున రోజుకు రూ.250 సంపాదించగలుగుతున్నాడు. ఇటుక బట్టీ పక్క స్కూలు, ఆటస్థలం ఉన్నాయి. ముషహర్ కులానికి చెందిన సోనును మిగతా కులాల విద్యార్థులు చదువుకోనివ్వడంలేదు. సోనుకు చదువుకోవాలని ఉన్నా, అగ్రకులాల విద్యార్థుల దాడిని భరించలేక మౌనంగా ఉన్నాడు. ఆ వేధింపును టీచర్లు చూసినా అడ్డుకోలేకపోతున్నారని సోను ఆరోపిస్తు న్నాడు. ఓవైపు కుటుంబ బాధ్యతలు, మరోపక్క అగ్రకులాల వేధిం పులు సోనును చదువుకు దూరంచేశాయి. కుటుంబానికి పెద్దదిక్కైన సోను సంపాదనతో తల్లిని, చెల్లిని పోషించగలుగుతున్నాడు.

తిరిగి వారి ఇళ్లకు వారిని పంపగలిగారు.

సర్వశిక్షా అభియాన్ సాయంతో స్కూళ్లు:

వలసకార్మికుల పిల్లల చదువులకోసం సర్వ శిక్షా అభియాన్ సాయంతో పాఠశాలలు నిర్వహించడానికి జిల్లా అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఒరియా భాష తెలిసిన వారిని ఉపాధ్యాయులుగా నియమించాలని చూస్తున్నారు. తెలంగాణలోని విద్యార్థులకు ఒరియా బోధన ఒక అవకాశంగా కల్పించాలనుకుంటున్నారు. 2014లో తెలంగాణ ఒరియా విద్యా బోధనకు సంబంధించి ఏ ఒక్క విద్యార్థిపేరు నమోదు కాలేదని సర్వశిక్షా అభియాన్ పేర్కొంది. వీరికి మధ్యాహ్న భోజన పథకం అమలు చేయ డానికి ప్రయత్నిస్తున్నారు. ఈలోగా 10, 12 తరగతులు చదువుకున్న వారెవరైనా వలస కార్మికుల పిల్లలకు చదువు చెపుతారేమో చూడాలని బట్టీ యజమానులకు సూచించామని జిల్లా అధికారులు చెప్పారు. పాఠశాల ఏర్పాటైతే ఈ పిల్లలకు ఒక ప్రయోజనం ఉంటుంది. వీరికి పాఠాలు చెప్పే టీచర్లకు సర్వ శిక్షా అభియాన్‌నుంచే జీతాలు అందుతుంటాయి. పదో తరగతి పాసయిన విద్యార్థిని టీచరుగా మోదరన్ ఆడిటర్స్ ఆఫ్ రూరల్ ఇండియా అనే సంస్థకు చెందిన సామాజిక కార్యకర్త ప్రభాకర్ రెడ్డి తీసుకొచ్చి పెట్టినా ఆ యువ టీచర్ ఎన్నాళ్లూ ఉండలేదు. కరీంనగర్‌లో ఈ బాలకార్మికుల సమస్యను తీసుకొని ప్రభుత్వేతర సంస్థ (ఎన్‌జిఒ) పనిచేస్తోంది. ఆ తరువాత కొత్తవారెవరూ దీన్ని పట్టించుకోవడంలేదు. కొంతమంది వలస కార్మికులు ఒడిషాలో తమ పేర్లు నమోదు చేయించుకోగా మిగిలిన వారు తెలంగాణలో రిజిష్టరు చేయించుకున్నారు. ఈరెండు రాష్ట్రాలకు సంబంధించి ఒక్క సంస్థవారే పరస్పర అవగాహనతో ఒప్పందం కుదుర్చుకొన్నారు. విభాజక కరీంనగర్ జిల్లాలోనే పన్నెండువేల నుంచి పదమూడు వేల వరకు వలస కార్మికులు రిజిష్టర్ అయ్యారని జిల్లా యంత్రాంగం చెపుతోంది. ఇటీవలనే 5వేలమంది వలస కార్మికుల పేర్లను రిజిష్టరు చేశారు. రిజిష్టరు కాకుండా ఎవర్నీ పనిలోకి తీసుకోవద్దని ఇటుకల బట్టీ యజమానులను జిల్లా యంత్రాంగం హెచ్చరించింది. అయిదేళ్లకన్నా తక్కువ వయసు పిల్లలను ఇక్కడకు తీసుకురావద్దని చట్టం చెపుతోంది.

అయితే సమస్య ఎక్కడంటే ఈ పిల్లలను విడిచిపెట్టి ఇంత దూరాన పనికి ఏ తల్లిదండ్రులూ రాలేకపో తున్నారు. అందువల్ల తమతో బాటు పిల్లలను తీసుకురాకతప్పడంలేదు. ఇది కళ్లతో చూడ్డమే తప్ప ఏంచేయలేకపోతున్నామని వారిని వెనక్కుపంపడం సాధ్యం కావటం లేదని జిల్లా యంత్రాంగం చెపుతోంది. ■

అభాగ్య బాలలకు నవ్వుల భాగ్యం..



ఆరోగ్యానికి పరమౌషధం నవ్వు అనేది అందరికీ తెలిసిందే. కానీ ఎంతమంది ప్రతినిత్యం మనసారా నవ్వుకోగలుగుతున్నారన్నది ప్రశ్నార్థకమే. నవ్వడం ఎంత ముఖ్యమో నవ్వించడమూ అంతే ముఖ్యం.. ఇతరులను నవ్వించడం అంటే వారి ఆరోగ్యానికి తోడ్పడుతున్నట్లే లెక్క. ఆ పనే చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచాడు పింటూ..ది క్లౌన్ మెజీషియన్ (ప్రవీణ్ తుల్‌పులే). ప్రవీణ్ గతంలో ఇండియన్ నేవీలో ఆఫీసర్‌గా పనిచేసేవారు. ఇప్పుడాయన కొన్ని ఆసుపత్రులలోని పిల్లల వార్డులలోను, అనాథ శరణాలయాలలోను నవ్వుల పూలు పూయిస్తున్నారు.

నావల్ ఆఫీసర్‌గా 'ఇండియన్ నేవీ'లో 17 ఏళ్లు పనిచేసిన ప్రవీణ్ 'లెఫ్టినెంట్ కమాండర్ కమ్యూనికేషన్స్ స్పెషలిస్ట్'గా రిటైరయ్యాడు. ప్రవీణ్ ప్రాధాన్యతలలో మ్యాజిక్ మొదటిదైతే, రెండవది క్లౌనింగ్. అందువల్ల చిన్నతనంలోనే 1973-74లో ప్రవీణ్‌కు మూడుజతల ప్లేయింగ్ కార్డ్స్ బహుమతిగా లభించాయి. వాటితో ట్రిక్స్ చేయడంపై సాధన మొదలుపెట్టాడు. పేవ్‌మెంట్లపై అమ్మే పుస్తకాలలో మ్యాజిక్‌కు సంబంధించినవి ఎంచుకుని కొనుక్కున్నాడు. కుటుంబ సభ్యుల ముందరే తొలి ప్రదర్శన ఇచ్చాడు. ఆ తర్వాత తమ బంధువు సహాయంతో ఇంటివద్దే షో నిర్వహించాడు. ఆ కార్యక్రమానికి తన తండ్రి డ్రెస్సింగ్ గౌన్ ధరించాడు. ప్రదర్శన చూడటానికి వచ్చిన పిల్లలు ఒక్కొక్కరినుంచి 25 పైసలు వసూలు చేశారు. ఆ ప్రదర్శన విజయవంతమైంది. ఆ తర్వాత కాలేజీరోజుల్లోను, నేవీలో పనిచేసే రోజుల్లోనూ ప్రవీణ్ మ్యాజిక్ ప్రదర్శనకు అవకాశాలు మెండుగా లభించేవి. 1995లో ప్రవీణ్, ముంబైలోని 'సొసైటీ ఆఫ్ ఇండియన్ మెజీషియన్స్'లో చేరాడు. తద్వారా మ్యాజిక్ రంగంలోని ప్రముఖుల గురించి, వారి వారి ప్రత్యేక నైపుణ్యాల గురించి అవగాహన పెంచుకున్నాడు. కార్డుల గమ్మత్తులు, జంతువులు, పక్షుల ట్రిక్కులు, వెంట్రిలాక్విజమ్‌లలో నైపుణ్యాన్ని మరింతగా మెరుగుపరుచుకున్నాడు. తనవేషధారణ క్లౌన్‌గా ఉంటేనే బాగుంటుందని నిశ్చయించుకున్నాడు. దీని వల్ల ప్రేక్షకులకు ఆశ్చర్యానందాలు కలిగించటంతో పాటు హాయిగా నవ్వించేవాడు.



ప్రవీణ్ ప్రేక్షకులలో 70శాతం పిల్లలే. అనాధశరణాలయాలు, ఆసుపత్రులలో పిల్లల వార్డులు, ఎన్‌జిఒలు నిర్వహించే ఈవెంట్లలో ప్రవీణ్ ఉచితంగా ప్రదర్శనలిచ్చేవాడు. ప్రవీణ్‌కు ఇద్దరమ్మాయిలు...శ్రుతి, మల్హర్. వారికి కూడా మ్యాజిక్‌లో మంచి తర్ఫీదిచ్చాడు ప్రవీణ్. అందుకే ఇప్పుడు వారు ప్రవీణ్ ఇచ్చే ప్రదర్శనల్లో అతడికి తమ తోడ్పాటును సైతం అందిస్తున్నారు. ప్రవీణ్ సాంఘిక సేవా కార్యక్రమాలలో అంకితభావంతో పాల్గొంటాడు. టాయ్ బ్యాంక్ ఇన్షియేటివ్‌కు సంబంధించిన అన్ని కార్యక్రమాలలో ప్రవీణ్ ముందుంటాడు. అలాగే స్కూళ్లలో శుభ్రతకు సంబంధించి విస్తృత ప్రచార కార్యక్రమాలను చేపట్టాడు. తన మ్యాజిక్ ట్రిక్స్ ద్వారా చేతుల శుభ్రత ఎంత ముఖ్యమో పిల్లలకర్థమయ్యేలా వివరిస్తాడు. తాను రెగ్యులర్‌గా రక్తదానం చేయటమేకాక, ప్రజలకు రక్తదానం చేయటం ఎంత మంచిపనో వివరించి, వారినందుకు ప్రోత్సహిస్తుంటాడు. అలాగే అవయవదానం గురించి కూడా..

తన ప్రదర్శనల్లో ఉత్తమమైనవేవి అని ప్రశ్నిస్తే, వేర్వేరు ఆసుపత్రులలో వివిధ వ్యాధులతో (క్యాన్సర్ సహా) పోరాడుతున్న బాలలున్న వార్డులలో ఇచ్చిన ప్రదర్శనలే ఉత్తమమైనవిగా తాను భావిస్తానంటాడు. వాళ్లని నవ్వించటమే కాదు, వారికోసం కేకులు కట్‌చేయడం, బొమ్మలు పంపిణీచేయటం, బెలూన్లతో వివిధరకాల బొమ్మలను తయారుచేసి ఇచ్చి వారిని సంతోష పరుస్తుంటాడు. ఒకసారి ప్రవీణ్ ప్రదర్శన ఇస్తుండగా ఐసియులో ఉన్న ఓబాలుడు కిటికీలోంచి తనను చూస్తుండటం గమనించి, ప్రవీణ్ తానే అక్కడకు వెళ్లి బాలుణ్ని కలిసి, అతడు ఆనందంగా నవ్వేలా చేశాడు.

తనది 'హ్యాపీ ఫూలింగ్' అంటాడు ప్రవీణ్. ఎందుకంటే నవ్విస్తూనే, తన ట్రిక్స్‌తో వారిని ఫూల్స్‌ని చేస్తాడు కాబట్టి. ప్రవీణ్ ఒకటే చెబుతాడు... జీవితం చాలా చిన్నది...ఆ చిన్నజీవితాన్ని ఆనందంగా నవ్వుతూ బతకండి...అని. ■

ఢిల్లీ గల్లీలో గాలిబ్ హవేలీ!

భారతదేశానికి చెందిన గొప్ప కవుల గురించిన ప్రస్తావనలో గాలిబ్ పేరు తప్పనిసరిగా ఉంటుంది. ఉర్దూతో పరిచయంలేని ఇతర భాషల వారికి కూడా గాలిబ్ సుపరిచితుడు. అది గాలిబ్ కవిత్వ ఘనత. కాబట్టే పరభాషల్లో సైతం విస్తృతంగా అనువాద మైంది. గాలిబ్ అసలు పేరు మీర్జా అసదుల్లాఖాన్. కానీ ఆయన గాలిబ్ గానే సుప్రసిద్ధుడయ్యాడు. గాలిబ్ తన తొలి కవితను పదకొండేళ్ల వయసులోనే రచించాడు. గాలిబ్ బహు భాషా కోవిదుడు. ఉర్దూ, పర్షియన్, టర్కీ మొదలైన భాషల్లో నిష్ణాతుడు. ఆయన కవితలు, షాయిరీలు చాలావరకు విఫల ప్రేమ, తత్ఫలితంగా ఆ వ్యక్తి అనుభవించే వేదన గురించే ఉంటాయి.



గాలిబ్ ఆగ్రాలో 1797 డిసెంబర్‌లో మీర్జా అబ్దుల్లా బేగ్ దంపతులకు జన్మించాడు. గాలిబ్ అయిదేళ్ల వయసు వాడిగా ఉన్నప్పుడే తండ్రి మరణించాడు. బంధువుల ఇంట పెరిగిన గాలిబ్‌కు 13 ఏళ్ల వయసులో ఉమ్రావ్ బేగంతో వివాహమైంది. గాలిబ్ ఆవెంటనే ఆగ్రా వదిలి ఢిల్లీ చేరుకున్నాడు. అది మొదలు మరణించేవరకు గాలిబ్ ఢిల్లీలోనే నివసించాడు. బహదూర్ షా జాఫర్ -II ఆస్థానకవుల్లో ఒకడు. చక్రవర్తి, గాలిబ్‌కు డబ్బీర్ ఉల్‌బీ ముల్క్, నజ్మ్ ఉద్ దౌలా బిరుదులు ప్రదానంచేశాడు.



గాలిబ్ ఆనాడు నివసించిన భవంతి, చాందినీ చౌక్‌లో నేటికీ నిలిచి ఉంది. ఈ హవేలీని గాలిబ్‌కు ఒక హకీం (సంప్రదాయ వైద్యుడు) బహుకరించాడు. ఆ వైద్యుడికి గాలిబ్ కవిత్వమంటే చెప్పలేనంత మక్కువ. ఈ హవేలీలోనే గాలిబ్ చక్కటి గజల్స్ రచించి, ప్రతి సాయంత్రం అసంఖ్యాక ప్రేక్షకులకు పాడి వినిపించేవాడు. గాలిబ్ 1869లో మరణించడంతో హకీం నిత్యం సాయంవేళల్లో తానే వెళ్లి అక్కడ కూర్చుని ఇతరులెవ్వరినీ ఆ తావును ఆక్రమించడానికి ఇష్టపడేవాడుకాదు.



1964లో ప్రభుత్వం ఈ హవేలీని స్వాధీనం చేసుకుని వేలంవేసి, అందరికన్నా ఎక్కువ వేలంపాట పాడిన మొహమ్మద్ అలీ ఫరూకికి అప్పగించింది. ఆయన కొద్దికాలం ఆ హవేలీని అద్దెకిచ్చాడు. కానీ కొద్ది సంవత్సరాలకే ఫరూకి మరణించాడు. ఆ ఆస్తికి ఎవరినీ చట్టబద్ధ వారసుల్ని చేయలేదు. అప్పట్నుంచి ఆ హవేలీ అనేకమంది చేతులు మారింది. కొన్నాళ్లు బొగ్గు స్టోర్‌గా...కొన్నాళ్లు ఏదో చిన్న పారిశ్రామిక సంస్థగా..ఆ తర్వాత వివాహ వేదికగా ఉంది. 1999లో హవేలీలోని కొంతభాగం ఢిల్లీ ప్రభుత్వ అధీనమైంది.

ఇప్పుడు అది సాంస్కృతిక వారసత్వ చిహ్నంగా ఉంది. ఆనాడు గాలిబ్ వాడిన వస్తువులు..తదితరాలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. అర్ధచంద్రాకారపు ప్రవేశద్వారంతో ఉండే ఈ ప్రాచీన భవంతిలో ప్రవేశించగానే గాలిబ్ స్వదస్తూరిలో రచించిన కప్లెట్స్‌తో కూడిన పెద్ద చిత్రం దర్శనమిస్తుంది. ఆపైన ఉస్తాద్ జౌక్, అబు జఫర్, మొమిన్ ఖాన్ మొమిన్, గాలిబ్ సమకాలికుల కప్లెట్స్‌ల పటాలు చూడవచ్చు. మరో చోట గాలిబ్‌కు ఇష్టమైన వ్యక్తిగత వస్తువులు..పొడవాటి టోపీ, పొడవాటి కుర్తా చూడవచ్చు. మరోఛార్ట్‌పై గాలిబ్‌కు ఇష్టమైన వంటకాల వివరం ఉంది..తాలే హు కబాబ్, భునా గోస్ట్, సోహన్ హల్వా, ఆమ్ కా మూర్, దాల్ మురబ్బా వంటివెన్నో ఆ జాబితాలో ఉన్నాయి. ఆయన హాబీల జాబితాను కూడా ఇక్కడ చూడవచ్చు. గాలిపటాలను ఎగరేయటం, చౌసర్, షత్రంజ్ (చదరంగం) గాలిబ్‌కు ఇష్టమైన హాబీలు.

హవేలీకి పక్కగా తలుపు ఉన్న గది ఒక్కటే ఉంది. ఇందులో పెద్ద గాలిబ్ ఫొటోఫ్రేమ్‌ను చూడవచ్చు. ఆగదిలో అటుఇటు గాలిబ్ జీవిత కాలంలో వేర్వేరు వయసులకు చెందిన చిత్రపటాలు ఉన్నాయి. ఆయన చేత్తో రాసిన పుస్తకాలే కాకుండా, గాలిబ్ రాసిన లేఖలు, అనువాద కప్లెట్స్, హుక్కా పీలుస్తున్న గాలిబ్ నిలువెత్తు ఫొటో, ఆకాలపు పాత్రలు ఇక్కడ చూడవచ్చు.

అసలు సిసలైన శాండ్‌స్టోన్ నేల, చెక్కతో నిర్మించిన ప్రవేశద్వారం వంటివి ఆకర్షిస్తాయి. గాలిబ్ డైరీ అనేక విశేషాలను తెలియజేస్తుంది. 1857 సిపాయిల తిరుగుబాటు కాలంలో ఢిల్లీని కుదిపివేసిన ఘటనలను గాలిబ్ విశదంగా పేర్కొన్నాడు. 1864 నవంబర్ 13న గాలిబ్ తన స్నేహితుడికి రాసిన లేఖలో..

క్షేమసమాచారం తర్వాత నన్ను నవంబర్ 1 నుంచి నవంబర్ 11 వరకు జరిగిన సంగతుల్ని చెప్ప నివ్వు. ఈ తిరుగుబాటు కాలంలో నేనెంత ఆందోళనకు గురయ్యానో చెప్పలేను. ఏమైనా నువ్వు క్షేమంగా, ఆరోగ్యంగా ఉండాలని నా కవిత్వంతో దేవుణ్ని ప్రార్థిస్తా.

వేయేళ్లు చల్లగా బతుకు
ప్రతి ఏడాదిలోని రోజులు
యాభైవేలుగా ఉండనీ.."

మొగల్ సామ్రాజ్యపతనానికి , బ్రిటిష్ వలస రాజ్య స్థాపనకు గాలిబ్ సాక్షీభూతంగా నిలిచాడు. అందువల్ల ఈ హవేలీ కేవలం కవి గాలిబ్ జ్ఞాపక చిహ్నంగానే కాక ఆ శకానికి సంబంధించిన గుర్తుగా కూడా నిలిచింది.

గాలిబ్‌ను, ఆ కాలాన్ని మన కళ్లముందు నిలిపే ఈ హవేలీని ఢిల్లీ వెళ్లినవారు తప్పక సందర్శించాలి. రోజంతా గాలిబ్ హవేలీ తెరిచే ఉంటుంది కానీ ఉదయం వేళ సందర్శిస్తే ఆ అద్వితీయానుభూతిని మాటల్లో చెప్పలేం. ■

కృతి

భావగర్భిత గీతాలు



ఒకప్పుడు ఆకాశవాణి పెద్దపీట వేసిన లలిత గీతాలకు ప్రాచుర్యం..ఆదరణ తగ్గిపోతున్న తరుణం లో 151 గీతాలతో డా.సి.భవానీదేవి వెలువరించిన పొత్తం 'భవానీ గీతాలు'. దాదాపు నాలుగు దశాబ్దాల సాహిత్య ప్రస్థానంలో కథ, నవల, కవిత్వం, గేయం, అనువాదం, నాటకం..యిలా వివిధప్రక్రియల్లో 44 గ్రంథాలు వెలువరించిన ప్రతిభావంతులరాలు భవానీదేవి.

'వేలిముద్ర వేదనలు తుడిచేసి/ సంతకాల చివురుల శిరసెత్తనీ' అంటూ ప్రభోదాత్మకంగా రాసినా..పిల్లలం..పిల్లలం/ తెల్లని మల్లె పువ్వులం/కల్లలెరుగని నవ్వులం/ ఇలపై నడిచే దివ్వెలం' అని బాలల గేయాన్ని ఆలపించినా, 'మురళిగానం పెదవితాకి/ మధురభావం ఎదను మీటి/ సరసగీతమై మోహమై ఎగసెలే/ అలలై, కలలై' అంటూ మోహావేశాన్ని గుప్పించినా, నిస్సారము ఈలోకము తీరు/ నాకిక శరణం నీచరణం' అంటూ భక్తి పారవశ్యంతో పరవశించినా అంతా భావభరితం, కవిత్వమయం. అన్నిగీతాలు సరళ భాషలో గానయోగ్యంగా ఉన్నాయి. ప్రముఖ సంగీత దర్శకులెందరో ఇందు లోని గీతాలకు స్వరరచన చేయటం విశేషం. క్యాసెట్లుగా విడుదల కావటం గమనార్హం. భవానీదేవి కీర్తి కిరీటంలో ఈ గీతాలు ధగధగా మెరిసే రత్నాలుగా నిలిచిపోవడం తథ్యం.

(భవానీగీతాలు-గేయ సంపుటి:డా.సి.భవానీదేవి; వెల:రూ.రూ.150; ప్రతులకు: నవచేతన..అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు)

-రమణ వెలమకన్ని

వాసిగల వ్యాసాలు




ప్రాచీన, ఆధునిక సాహిత్యాలు రెండింటా చక్కని అభినివేశం కల రచయిత్రి డా.శ్రీమతి కె.అరుణా వ్యాస్. ఆమె 'సురక్ష' మేగజైన్‌లో రాసిన వ్యాసాలను 'విజ్ఞాన వీచికలు' పేరిట సంపుటిగా వెలువరించారు. ఇందులో వివిధ అంశాలపై సమాచారం, హితవుతో కూడిన వ్యాసాలున్నాయి. తొలివ్యాసం 'బూచాడమ్మా బూచాడు..బుల్లిపెట్టెలో ఉన్నాడు'లో టెలిఫోన్ ఆవిష్కరణ నాటి నుంచి నేటివరకు సంబంధిత సమాచారం ఇవ్వడంతోపాటు, నేటి కాలంలో యువతపై వాటి దుష్ప్రభావాన్ని ఎత్తిచూపి, బూచాడు, నేడు నిజమైన బూచిగా మారాడని తల్లిదండ్రులను హెచ్చరిస్తారు. 'గురువు లేక విద్య గురుతుగా దొరకదు'లో విషయపరిజ్ఞాన బోధనే విద్యకాదని, విద్యార్థులను ధార్మికంగా, నిజాయితీగా ఆదర్శాల వైపు గురువులు నడిపించాలనడం బాగుంది. 'కన్నతల్లి కంటే ఘన దైవ మింకేది'వ్యాసంలో 'సృష్టిని కొనసాగించే మరో సృష్టికర్త అమ్మ' అని ఎంతో గొప్పగా చెప్పారు. 'నీవే తల్లివి తండ్రివి'లో చివరగా అనాథ అనే పదమే అంతరించిపోవాలంటూ స్ఫూర్తినివ్వడం ప్రశంసనీయం. రేడియో గురించిన వ్యాసానికి 'ఆకాశం నినదిస్తోంది' మకుటం చక్కగా కుదిరింది. 'సిరిమల్లె పువ్వల్లె నవ్వు'లో నాణ్యంగా నవ్వించారు. ప్రతిపుటలో విజ్ఞానాన్ని ప్రోదిచేసిన ఈ పుస్తకం అవశ్యపఠనీయం.

(విజ్ఞాన వీచికలు:డా.శ్రీమతి కె.అరుణావ్యాస్; వెల:రూ.100; ప్రతులకు: సురక్ష పబ్లికేషన్స్, 'సురక్ష' పోలీసు మాసపత్రిక కార్యాలయం, ఆం.ప్ర. డిజిపి ఆఫీస్, లక్డీకపూల్, హైదరాబాద్- 500004)

-జె.శ్యామల

మదిని తాకే మంచి నవల



పాఠకుడిని అక్షరాల వెంట పరుగెట్టిస్తూ, పూర్తయ్యేదాకా ఉత్కంఠరేపుతూ, ఆ తర్వాత కూడా కొన్ని క్షణాలపాటు ఆ 'ట్రాన్స్'లోంచి బయటకు రాలేకపోవటం ఒక మంచి కథకుగాని, నవలకు గాని ఉండాల్సిన ముఖ్యలక్షణం. చిరపరిచిత రచయిత సింహప్రసాద్ ఇటీవల వెలువరించిన నవల 'నిండు నూరేళ్ళ'లో ఈ లక్షణం బాగా ఉంది.


నేటి సమాజంలోని యువత, ఐశ్వర్యం, అది తెచ్చే అతిశయం, బుల్లితెర, చలనచిత్ర రంగాల్లోని కుట్రలు, కుతంత్రాలు.. వాటికి బలయ్యే అమాయక జీవులు, మనిషిని మనిషే నిలువునా తినేస్తున్న దౌష్ట్యం, వీటిని తట్టుకోలేని బడుగుజీవుల ఆత్మహత్యలు, ఫలితంగా విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు..ఈ విషనాగుల మధ్య మంచి గంధంలాంటి స్నేహం..వీటన్నిటి సమాహారమే ఈ నవల.

విజిత అనే సంపన్న గృహిణికి ఓ అర్ధరాత్రి తన పూర్వ స్నేహితుడి నుండి తాను ఆత్మహత్య చేసుకోబోతున్నానంటూ ఎస్ఎంఎస్ వస్తుంది. పుణేలో ఉంటున్న ఆమె సరాసరి హైదరాబాద్‌కు బయల్దేరి స్నేహితుడు విహాన్ గురించి, ఎక్కడెక్కడో గాలించి, చివరకు గాడితప్పని విహాన్ జీవితాన్ని గాడిలోపెట్టటంతో నవల ముగుస్తుంది. ఆత్మహత్యల వల్ల జరిగే అనర్థాలను వివరిస్తూ స్నేహం ఔన్నత్యాన్ని, స్వచ్ఛతను వివరిస్తుంది నవల. పాఠకుల హృదయాల్లో చిరకాలం నిలిచే సృజన ఇది.

(నిండు నూరేళ్లు-నవల: సింహప్రసాద్; వెల: రూ.140; ప్రతులకు: అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు)

- కూర చిదంబరం

ఉపయుక్త పుస్తకం..




తెలంగాణ రాష్ట్రం పది జిల్లాల నుండి 31 జిల్లాలుగా అవతరించిన నేపథ్యంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, ఇతరులందరికీ కరదీపికగా నిలిచేలా 'తెలంగాణ దర్శిని' పేరిట చక్కని సంకలనం అందించారు కోయ చంద్రమోహన్, తంగిరాల చక్రవర్తి. ఇందులో రాష్ట్ర ఆవిర్భావం, చిహ్నాలు, నదులు, మంత్రివర్గం, వారి ఫోన్లు, సైట్లు, కొత్తజిల్లాలు- జిల్లాకేంద్రాలు- మండలాలు- విద్యాశాఖ అధికార్లు, ఎమ్ఎల్ఎలు, ఎంపిలు, యూనివర్సిటీలు, పత్రికా కార్యాలయాలు వగైరా సమాచారాన్ని అందించారు.

(తెలంగాణ దర్శిని-సంకలనం:కోయచంద్రమోహన్, తంగిరాలచక్రవర్తి; వెల:రూ.30; ప్రతులకు:నవతెలంగాణ పబ్లికేషన్స్ అన్నిబ్రాంచీలు)

-కె.వి.ఎన్.ఎల్.ప్రసన్నకుమారి

చిన్ని కథల్లో గొప్ప సందేశం



విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే ఆశయంతో ఓ ఇరవై కథల్ని 'ది ఎంప్టీ కప్' పేరిట అందించారు మల్లవరపు విజయ. కథలన్నీ పిల్లల్ని ఆకట్టుకునేలా ఉన్నాయి. మచ్చుకు 'ఈర్ష్య' కథలో..పరిమళ 7వ తరగతి విద్యార్థిని. కలెక్టర్ తనిఖీకి రాగా, తోటిపిల్లలు ఆమె పుస్తకాల సంచి దాస్తారు. అయినా ఆమె అడిగిన ప్రశ్నలకు చక్కగా జవాబుచెప్పి నగదు బహుమతి పొందుతుంది. తోటిపిల్లలు అవాక్కవుతారు.

(ది ఎంప్టీ కప్-మినీకథలు:మల్లవరపు విజయ; వెల:రూ.40; ప్రతులకు: మల్లవరపు విజయ, 1-1-502, మహాజన్ అపార్ట్‌మెంట్, వినాయక్ నగర్, నిజామాబాద్, తెలంగాణ.

-తంగిరాల చక్రవర్తి



జగమంతా ప్రేమమయం

కస్తూరి మురళీకృష్ణ

‘ప్రేమ శారీరక అందంపై ఆధారపడి ఉంటుంది కదా?’ దారిలో కనబడుతున్న అందమైన యువతులను చూస్తూ అడిగాడు బలరాముడు.

సమాధానంగా శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వాడు.

‘అందం సాపేక్ష పదం. ఒకరికి అందంగా అనిపించింది మరొకరికి అందంగా అనిపించకపోవచ్చు. అందంపై ఆధారపడే ప్రేమ వ్యక్తిగత ఇష్టాయిష్టాలను, వ్యక్తి వ్యక్తిత్వాన్ని సూచిస్తుంది’.

‘నువ్వు వ్యక్తిగతం, వ్యక్తిత్వం గురించి మాట్లాడుతున్నావా కృష్ణా? నీకు ఈ సమస్త సృష్టి అందంగా కనిపిస్తుంది. సృష్టిలోని అణువణువూ అందంగా కనిపిస్తుంది. అందుకే కదా నువ్వు అందరినీ ప్రేమిస్తావు. అది కూడా వ్యక్తి వ్యక్తిత్వాన్ని సూచిస్తుందా?’

అందరిలో నన్ను చూసుకుంటాను. కాబట్టి అందరినీ ప్రేమిస్తాను. అంటే నేను ప్రేమిస్తున్నది నన్నేకదా. ఎప్పుడైతే వ్యక్తి తాను మరో వ్యక్తిని ప్రేమిస్తున్నానని అనుకుంటాడో అప్పుడు తనని తాను కోల్పోతాడు. కానీ ఎప్పుడైతే తాను ప్రేమిస్తున్నది ఎదుటివ్యక్తిలోని తననే అన్న నిజం గ్రహిస్తాడో అప్పుడు తనని తాను తెలుసుకుంటాడు. అప్పుడీ ప్రపంచంలో అందవిహీనమైనది కనపడదు. ప్రేమించే అర్హత లేనిది ఉండదు’.

శ్రీకృష్ణుడి మాటలలోని లోతును అర్థం చేసుకున్న బలరాముడు మౌనంగా ఆలోచిస్తూ నడవసాగాడు. ‘అంటే ఎదుటివ్యక్తిలోని సౌందర్యం చూడలేకపోవటం వ్యక్తి వ్యక్తిత్వ లోపమా?’

అంతవరకూ చూస్తున్న ప్రతి విషయంపై వ్యాఖ్యానిస్తూ, ఆనందిస్తూ నడుస్తున్న బలరాముడు ఆలోచిస్తూ నిశ్శబ్దంగా అయిపోయాడు.

శ్రీకృష్ణుడు చిరునవ్వుతో అన్నిటినీ చూస్తూ నడుస్తున్నాడు. గమనిస్తే అతని చిరునవ్వు గాలి వీచినంత, నీరు పారినంత, సూర్య కిరణం మెరిసినంత సహజంగా ప్రాకృతికంగా ఉంది. గాలి వీయటం మానదు. నీరు పారటం మానదు. సూర్యకిరణం మెరవటం మానదు. శ్రీకృష్ణుని పెదవులపై చిరునవ్వు చెరగదు.

నడుస్తున్న బలరాముడు హఠాత్తుగా ఆగాడు. శ్రీకృష్ణుడి బాల్య మిత్రుడు సుదామను కలిశారు వారిద్దరు. సుదామ పేదవాడు. కృష్ణ బలరాములు ధనానికి లోటులేనివారు. కానీ వారి విద్యాభ్యాసంలో కానీ, స్నేహంలో కానీ ఎలాంటి భేదభావాలు లేవు. తేడాలు లేవు. ఆ కాలంలో వ్యక్తికి సామాజికస్థాయి కొలబద్దకాదు. సుదామతో గడపిన ఆనందకరమైన కాలాన్ని స్మరిస్తూ మధుర వీధులలో సంచరిస్తున్నారు వారిద్దరు. ఇంతలో బలరాముడి దృష్టి దూరంగా గూనివీపు బరువుతోవంగి అత్యంత వక్రంగా, అసహ్యంగా ఉన్న ఆమెపై పడింది.చేతిలో పళ్లెంతో ఆమె నడుస్తూంటే అసహ్యంతోపాటు హాస్యంగా కూడా ఉంది. మనుషులు అంత వికారంగా కూడా ఉంటారని బలరాముడు కలలోకూడా ఊహించలేదు. ఆమెని చూస్తూంటేనే జుగుప్సతో శరీరం జలదరించింది. ఆవైపు చూడాలని కూడా అనిపించటంలేదు.

అంతవరకూ అందంగా, ఆహ్లాదకరంగా కనిపించిన మధుర వీధులు, మనుషులు ఆమెని చూసిన తరువాత అందవిహీనంగా, అసహ్యంగా అనిపిస్తున్నాయి. తనలో కలుగుతున్న భావాలను అణచి శ్రీకృష్ణుడి వైపు చూశాడు. అన్నిటినీ ఆనందంగా చూస్తూ సంతోషిస్తున్న కృష్ణుడి పెదవులపై చిరునవ్వు అలాగే ఉంది. ఆమె కురూపం శ్రీకృష్ణుడు గమనించనట్టున్నాడు.

‘నువ్వు అందరూ అందంగా ఉన్నారంటావుగా..ఆమె అందంగా ఉందా నీ కళ్లకు?’ అడిగాడు బలరాముడు, ఆ గూనివైపు వేలుచూపుతూ.

మృదువుగా బలరాముడి వేలును దించాడు శ్రీకృష్ణుడు.

‘పైపై ఆకారం చూసి మోసపోకు. ఆమె ఎంతో అందమైనది’ అంటూ ఆమె దారికి అడ్డుగా నిలబడ్డాడు శ్రీకృష్ణుడు.

****

తలవంచుకుని వేగంగా నడవాలని ప్రయత్నిస్తోంది కుబ్జ. కానీ నడవలేకపోతోంది. భగవంతుడు ప్రాకృతికంగా ఆమె మీద బరువు పెట్టాడు. తనను చూసి అందరూ ముఖం తిప్పుకోవటం ఆమెకూ తెలుసు. ఇప్పుడేకాదు చిన్నప్పటి నుంచీ అందరూ తనని చూసి నవ్వుకోవటం, ఏడ్పించటం, హేళన చేయటం ఆమెకు తెలుసు. ఆమె మనిషి కానట్టు, ఆమెకు హృదయం లేనట్టు అందరూ ప్రవర్తించటం ఆమెను బాధిస్తుంది. కానీ ఏంచేస్తుంది కుబ్జ? మామూలు మనుషులు అన్యాయం చేస్తే పోరాడవచ్చు. ప్రతీకారానికి ప్రయత్నించవచ్చు. కానీ భగవంతుడే అన్యాయం చేస్తే ఏంచేయాలి? భగవంతుడు కరుణామయుడు, దయామయుడు అంటారు. భగవంతడు ప్రేమ స్వరూపుడు అని అంటారు. తానేం తప్పు చేసిందని తనకీ శిక్ష విధించాడు?

అందరిలా తానెందుకు లేదు? తనతోటివారంతా నవ్వుతూ, తుళ్లుతూ అందమైన సీతాకోక చిలుకల్లా తిరుగుతూ ఉంటే, తాను మాత్రం గొంగళిపురుగులా ఉండిపోయింది. ఇందులో తన దోషం ఏముంది? ఎందుకని తానిలా ఉండిపోయింది? అనుక్షణం ఆమెని వేధించే సమాధానంలేని ప్రశ్నలివి. తన అసలు పేరు ఎవరికీ గుర్తు లేదు. తనకీ గుర్తులేదు. ‘కుబ్జ’ అంటే ‘గూని’ అన్న పేరు స్థిరపడిపోయింది. ‘ఏయ్ గూని..వక్రరాణి’ అని ఏడిపిస్తారు అందరూ. ఇతరులు ఎంత పొరపాటుచేసినా వాళ్ల అందం చూసి మైమరచిపోతారు. ఎంత తప్పునయినా క్షమిస్తారు. అదే..తన విషయంలో?!? తనని చూస్తేనే చిరాకుపడతారు.తిడతారు. తాను, వారికి ఎదురుపడటమే తనదోషం అన్నట్టు చేస్తారు. అసహ్యించుకుంటారు.

తానిలా ఉండటంలో తన ప్రమేయం ఏముంది?

అనుక్షణం కుబ్జను వేధించే ప్రశ్న ఇదే....వయసుతోపాటు ఆమె అందం మరింత వికారం అవుతూ వచ్చింది. కానీ ఆమెలో ప్రాకృతమైన కోరికలు సహజంగా కలిగాయి. ఆమెతో ఎదిగాయి.

కానీ..ఎవ్వరూ ఆమెను మనిషిగా గుర్తించలేదు. ఆమెకూ ఓ మనసుంటుందన్న భావనే ఎవరికీ లేదు. దాంతో తననిలా పుట్టించిన భగవంతుడిని అనుక్షణం ప్రశ్నిస్తూ, తన దురదృష్టానికి చింతిస్తూ, కుమిలిపోతూ జీవచ్ఛవంలా ఆశలులేని మోడులా జీవితాన్ని సాగిస్తోంది కుబ్జ. ఎవరేమన్నా పట్టించుకోని రీతిలో తన చుట్టూ కఠినమైన

రక్షణ కవచాన్ని నిర్మించుకుంది. ఆమె దారిలో నడుస్తూంటుంది. కానీ ఆమె చెవులను ఎలాంటి శబ్దాలు తాకవు. ఆమె కళ్లకు ఏమీ కనిపించవు దారి తప్ప.

ఓరోజు ఆమె అనుకోకుండా శ్రీకృష్ణుడి గురించి విన్నది.

'శ్రీకృష్ణుడు నల్లనివాడు కానీ మనసును కరగించే రీతిలో పిల్లనగ్రోవి ఊదుతాడు. ఆ పిల్లనగ్రోవి శబ్ద తరంగాలు హృదయ లోతుల్లో కలిగించే ప్రకంపనలు జగతిని మరపింపజేస్తాయి. మనిషికి 'తాను' అన్న స్మృతిని పోగొట్టి, ఒక ఆనందకరమైన స్పందనగా మార్చేస్తాయి. ఆనందపరవశానుభూతిగా రూపాంతరమొందిస్తాయి' ఎవరో మాట్లాడుకుంటే విన్నది.

'అపారమైన ప్రేమ సముద్రం శ్రీకృష్ణుడు. అనంతమైనది అతడి ప్రేమ. అతడికి ద్వేషం అన్నది తెలియదు. అసహ్యం, సహ్యం అన్న మాటలు ఆయనకు తెలియవు. ఈ ప్రపంచం, ఈ విశ్వం సర్వం ఆయనకు అత్యంత అందమైంది. ప్రియమైనది, సృష్టిలోని ప్రతి అణువుపై ప్రేమ రసామృతవర్షం కురిపిస్తాడాయన' మరింకెవరో అన్నారు.

ఆ మాటలు వింటూనే కుబ్జ శరీరం పులకరించింది. మనసు పరిమళించింది. 'ఈప్రపంచం మొత్తం అందంగా కనిపించే వాడికి తాను అందంగా కనిపిస్తుందా? ఇతరులెవరూ చూడలేని తన హృదయ సౌందర్యం శ్రీకృష్ణుడికి కనిపిస్తుందా?'

'రాత్రిపూట శ్రీకృష్ణుడు వేణువు ఊదుతూంటే, చిక్కని చీకటితో నిండిన అడవిలో, చీకటిలో మునిగి కనబడని దారిలో, చీకటి నలుపులో కలిసిపోయి కనబడని శ్రీకృష్ణుడని కేవలం అతని వేణువుపై వెలిగే ముత్యాలమెరుపును బట్టి ఆయన జాడ కనుగొని గోపికలు సర్వం మరచి రాత్రంతా ఆనందతాండవం చేస్తారట. శ్రీకృష్ణుడిని భగవంతుడిగా భావించి కలుస్తారట. అతని సాంగత్యంలో తమలోని వికారాలు, కల్మషాలు కరగిపోగా తాము అత్యంత పవిత్రులమైనట్టు భావిస్తారట'.

ఆ మాటలు వింటూంటే ఒక్కసారి కృష్ణుడి వేణుగానం వినాలన్న కోరిక కుబ్జలో కలిగింది. ఆ వేణుగాన మాధురీ స్రవంతిలో ఈదులాడి తన అందవికారితనాన్ని కడిగేసుకుని సుందరంగా తయారవ్వాలని ఆమె మనసు తపనపడింది. కృష్ణదర్శనంతో తను కుబ్జనుంచి అబ్జనవ్వాలన్న ఆశ ఆమెలో జనించింది.

అవును..ద్వేషం అందం కూడా అసహ్యంగా కనిపించేట్టు చేస్తుంది.

ప్రేమ..అసహ్యాన్ని కూడా అత్యంత అందంగా కనబడేట్టు చేస్తుంది.

కానీ..కృష్ణదర్శనభాగ్యం తనకు కలిగేదెలా?' అన్న బాధ కలిగేది. కృష్ణుడు ఉండేది బ్రజ భూమిలో. రాసలీల బృందావనంలో..

తానుండేది మధురలో. కంసుడి రాజ్యంలో. ఇలాంటి పలు ఆలోచనలతో కుంగుతూ కంస మహారాజుకోసం చందనాన్ని తీసుకు వెళ్తోంది కుబ్జ. ఏదైనా అద్భుతం జరిగి శ్రీకృష్ణుడు తన ఎదురుగా వస్తే? తన కురూపితనాన్ని అంతంచేసి తనను అందమైన సుందరిగా మారిస్తే? ఇతర యువతులలాగే తననూ ఓ యువకుడు మెచ్చి ప్రేమిస్తే? పలురకాల ఆశనిరాశల భావనల నడుమ ఊగుతూ తనదైన లోకంలో నడుస్తోంది కుబ్జ. ఎంతగా తన చుట్టూ రక్షణ కవచం నిర్మించుకున్నా, ఎంతగా బయట ప్రపంచం తనను తాకకుండా కఠినమైన అడ్డుగోడ నిర్మించుకున్నా..బయట ప్రపంచం మాటలు ఆమెని తాకుతున్నాయి. బాధిస్తున్నాయి.

తానూ ఓ మనిషిననీ, తనకూ మనసుంటుందనీ ఎందుకనుకోరు?

తనకూ ఆశలూ, కోరికలుంటాయని ఎందుకనుకోరు? అందవికారికీ మనసుంటుంది. అందవికారికీ కోరికలుంటాయి. గూని శరీరానికే కానీ మనసుకు కాదుకదా? కుబ్జ కంట్లో నీళ్లు నిండాయి.

'హేకృష్ణా..నిన్ను కలిసే భాగ్యం నాకుందా? ఈ అందవికారితనం నుంచి, నిరాశనుంచీ నాకు విముక్తి ఉందా?' ఆమె మనసులో ఆక్రోశించింది.

****

ఆమె దారికి అడ్డుగా నుంచున్నాడు శ్రీకృష్ణుడు. లేకపోతే తలెత్తి ఆమె తనను చూడదని అతడికి తెలుసు. తనవైపు చూసే చూపుల్లోని అసహ్యాన్ని, నిరాదరణను ఆమె భరించలేదనీ అతనికి తెలుసు. అందుకే మనుషులవైపు చూడటం మానుకుందామె.

ఎవరో పోకిరీవాడు దారికి అడ్డంగా నిలుచున్నాడని భావించి పక్కకు తొలగబోయింది కుబ్జ.

కృష్ణుడు ఆమెను పోనీయలేదు. అడ్డుపడ్డాడు.

ఆమె కళ్లల్లోకి నీళ్లు వచ్చాయి. 'దారి విడవండి' బొంగురుగా ధ్వనించింది ఆమె గొంతు. ఆమె రూపం చూసి పారిపోనివారు. గొంతు విని పారిపోతారు. కానీ అతడు కదలలేదు.

ఆమెకు విసుగువచ్చింది.ఏడుపువచ్చింది.

'ఈ పనికిరాని జీవితానికి పోకిరీగాళ్ల వేధింపులొకటి' అనుకుంది.

'దారి విడవండి' కళ్లెత్తి అతనివైపు చూసింది.

'నల్లనివాడు, పద్మనయనంబులవాడు, కృపారసము పైన్
జల్లెడువాడు, మౌళి, పరిసర్పిత పింఛమువాడు, నవ్వు రా
జిల్లెడు మోమువాడు...'ఎదురుగా నిలుచున్నాడు.

ఆమె నిర్ఘాంతపోయింది. స్థాణువైపోయింది. తనను తాను మరచిపోయింది. ఎదురుగా నిలుచున్న శ్రీకృష్ణుడి కనులనుండి ప్రవహిస్తున్న ప్రేమసుధారస ప్రవాహం ఆమె తనువులోని అణువణువునెల్లా ముంచెత్తింది. కఠినమైన మంచుశిల వెచ్చని సముద్రపునీరు తాకి కరగి నీరైనట్టు ఆమె శరీరం సర్వం కరగి తాను రూపాంతరం చెందుతున్న భావన ఆమెకు కలిగింది. ప్రేమ మనిషిని మారుస్తుందనీ, తనని తాను అపురూపంగా అమూల్యంగా భావించుకునేట్టు చేసి ఆత్మవిశ్వాసం పెంపొందిస్తుందనీ, తననితాను అపురూపంగా, అమూల్యంగా భావించుకునేట్టు చేసి ఆత్మవిశ్వాసం పెంపొందిస్తుందనీ ఇన్నాళ్లూ అనుకుంది. ఇప్పుడు అనుభవిస్తోంది.

కృష్ణుడు చూపులు తనపై ప్రసరించగానే ఆమెకు తన శరీరంలోని అణువణువూ సూర్యకిరణంలా స్వచ్ఛమై, సూర్యకిరణం తాకిన కమలంలా సర్వాంగసుందరంగా విచ్చుకున్న భావన కలిగింది.

భగవంతుడి సృష్టిలో 'కురూపం' అన్నదిలేదు. అందవిహీనం అన్నది లేదు. అలాంటిదేదైనా ఉంటే అది ఆ అందాన్ని గ్రహించలేని వ్యక్తి భౌతిక ఇంద్రియాల లోపం తప్ప భగవంతుడి రచనలో లోపం కాదు అనుకుంది. ఆమెకు తాను కురూపిని అన్న భావన పోయింది. తాను కుబ్జను అన్న భావన పోయింది. తాను అబ్జ ఇప్పుడు...

సూర్యకిరణాలు పరివర్తనం చెంది చంద్రకిరణాల్లా శీతలీకరణం చెందిన కిరణాలు తాకగానే విచ్చుకునే కలువలా ఆమె విచ్చుకుంది.

రాత్రి కలువ..పగలు కమలం.. తాను కుబ్జకాదు..అబ్జ..'

ప్రపంచంలో అత్యంత అందగత్తెను తాను అన్న జ్ఞానం కలగటంతో ఆమె అనాకారితనం పోయింది.

తనను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన శ్రీకృష్ణుడివైపు చూసింది.

'నన్ను నేను సమర్పించుకుంటున్నాను. స్వీకరించండి స్వామీ' అన్నట్టుందా చూపు.

శ్రీకృష్ణుడు అడుగుముందు వేసి, ఆమె కాళ్లపై తన కాళ్లు నిలిపి, చుబుకం కింద చేతులుంచి తలను పైకి ఎత్తాడు.

శ్రీకృష్ణ స్పర్శతో పులకితాంతరంగ అయిందామె.

ఆమె శరీరం సర్వం ప్రేమప్రవాహంలా మారి తరంగాలనృత్యంతో తళతళలాడింది.

'నీ మనసుకు పట్టిన కుబ్జత్వం వదిలింది. నిటారుగా నిలువు. అత్యంత సుందరమైన స్త్రీవి నీవు. అబ్జవు' అన్నాడు శ్రీకృష్ణుడు.

ఆమె మాట్లాడలేకపోయింది. ఎంతో మాట్లాడాలనుకుంది.

ఆమె హృదయం విహంగమై విశాలాంబర వీదుల్లో వీరవిహారం చేస్తోంది. 'నేను మీకోసం ఎదురుచూస్తుంటాను' అంది.

శ్రీకృష్ణుడు చల్లగా నవ్వాడు. ముందుకు సాగిపోయాడు.

అందంగా అబ్జలా మారిన కుబ్జ మాత్రం జీవితాంతం శ్రీకృష్ణుడి కోసం ఎదురుచూస్తూ నిలిచిపోయింది.

మామూలు మనుషుల చూపులు సోకితే మళ్లీ తాను కుబ్జలా మారతానన్న భయంతో వెన్నెలకోసం ఎదురుచూసే చకోర పక్షిలా శ్రీకృష్ణుడి రాకకోసం ఎదురుచూస్తూండిపోయింది.

■

పదాన్వేషణ-17

నిర్వహణ
గుల్ మహమ్మద్ నాయక్

1	2	3	4	5	6
R,A	B,E	C,L	S,W	M,N	D,P

పిల్లలూ! కింది ఆధారాలకు ఎదురుగా ఉన్న అంకెలను చూడండి. ఆ అంకెలతో సంబంధం ఉన్న పై గళ్లలోని రెండు అక్షరాలతో ఆధారానికి తగిన జవాబును రెండు ఆంగ్ల పదాలతో రాయండి.

ఉదా:ఆధారం: డబ్బులు పెట్టుకునే చిన్న సంచి-5,6


అంటే 5వ గడిలోంచి ఒక అక్షరం, 6వ గడిలోంచి ఒక అక్షరం తీసుకుని జవాబు రాయాలి.

జవాబు: 5వ గడిలోంచి 'M', 6వ గడిలోంచి 'P' తీసుకుని 'MONEY PURSE' అని జవాబు రాయాలి.

ఆధారాలు:

1.మేజర్ గ్రామపంచాయితీల్లో ఇల్లిల్లూ తిరిగే ఉద్యోగి.-2,3.........
2.అయినవాళ్లకు ప్రభుత్వం ఇది పరుస్తుందంటారు. - 1,3 ....
3.సినిమాకు ముఖ్యంగా 'ఇది' బాగుండాలంటారు. -4,6 ....
4.అదృష్టము కాదు - 2,3 ....
5.తరగతి గదిలో గోడకు మేకుకొట్టి దీన్ని తగిలిస్తారు -4,5........

దారి చూపుతారా



శిష్యరికం

కథ

ఒక యతీశ్వరుడు అడవిలో ఆశ్రమాన్ని నిర్మించుకుని కందమూలాలు తింటూ, తపస్సు చేసి అనేక మహిమలను సంపాదించుకున్నాడు. ఆ రాజ్యంలోని ప్రజలు యతీశ్వరుడి మహిమల గురించి చెప్పుకోవడమే తప్ప ఎవరూ ఆయన్ని చూసింది లేదు. కలిసి మాట్లాడినవారు అసలే లేరు. మునీశ్వరుడి గురించి విని శిష్యరికం చేయాలని ఇద్దరు మిత్రులు ఆయనను వెతుక్కుంటూ అడవికి బయలుదేరారు. కొంతకాలానికి యతీశ్వరుడి వద్దకు చేరారు.



'నాయనా! మీరెవరు? ఈ కీకారణ్యానికి ఎందుకు వచ్చారు' ప్రశ్నించాడు యతీశ్వరుడు.

'మునీశ్వరా! నా పేరు చంద్రతేజ. ఇతడు నా మిత్రుడు ఇంద్రతేజ. మేమిద్దరం మీ మహిమలను గురించి విన్నాము. మీవద్ద శిష్యరికం చేయాలనే తలంపుతో మిమ్మల్ని వెతుక్కుంటూ అడవికి వచ్చాము. మా అదృష్టం కొద్దీ మీరు మాకు కనిపించారు' అన్నాడు చంద్రతేజ.

'మీరు నా శిష్యులుగా అంగీకరించడానికి ముందు మీకో పరీక్ష పెడతాను. దానిలో నెగ్గినవారిని మాత్రమే నా శిష్యుడిగా చేర్చుకుని నా అంతటి వాడిని చేస్తాను' అన్నాడు యతీశ్వరుడు.

'అలాగే స్వామీ! మేమేంచేయాలి' అడిగారు మిత్రులు.

'నేను చెరో రామచిలుకను ఇస్తాను. ఎవరూ చూడకుండా మీకిచ్చిన రామచిలుకను పీక పిసికి చంపి తీసుకువచ్చి నాకు చూపించాలి.అలా చేసినవారిని నా శిష్యుడిగా చేర్చుకుంటాను' అన్నాడు యతీశ్వరుడు.

వెంటనే ఇంద్రతేజ మునీశ్వరుని ఆశ్రమంలోనికి వెళ్లి తలుపు మూసుకుని ఏకాంతంగా రామచిలుక పీకపిసికి చంపేశాడు. చంపిన వెంటనే మునీశ్వరుని వద్దకు వెళ్లి చూపించి 'స్వామీ! మీరు చెప్పినట్లు ఎవరూ చూడకుండా ఏకాంతంలో ఈ రామచిలుక పీకనులిమి చంపేశాను. మీరు చెప్పిన పని చేశాను. కాబట్టి మీ శిష్యుడిగా చేరే అర్హత నాకుమాత్రమే ఉంది' గొప్పగా చెప్పాడు.

ఇంతలో చంద్రతేజ వచ్చాడు. అతని చేతిలోని రామచిలుక ఇంకా జీవించే ఉంది.

'ఏం నాయనా! నువ్వు రామచిలుకను ఎందుకు చంపలేదు?' అడిగాడు యతీశ్వరుడు.

'స్వామీ ఎవరూ చూడకుండా దీని పీక నులిమి చంపమన్నారు. మనుషులు, పశు పక్ష్యాదులు చూడకుండా దీన్ని చంపవచ్చు. కానీ భగవంతుడు సర్వాంతర్యామి. పైనున్న భగవంతుడు ఇదంతా చూస్తున్నాడుగా స్వామీ. అందుకే దీన్ని పీక నులిమి చంపలేకపోయాను' వినయంగా చెప్పాడు చంద్రతేజ.

యతీశ్వరుడు చంద్రతేజను మెచ్చుకొని తన శిష్యుడిగా అంగీకరించి ఇంద్రతేజను తన రాజ్యానికి వెళ్లిపొమ్మని ఆదేశించాడు.

'నాయనా! భగవంతుడు సర్వాంతర్యామి అని భావించినవారు చెడ్డపనులు, ఇతరులకు అపకారం చేసే పనులు చేయడానికి జంకుతారు. అటువంటి సద్గుణాలు చంద్రతేజ్‌లో ఉన్నాయి కాబట్టి అతడిని నా శిష్యుడిగా అంగీకరిస్తున్నాను' అన్నాడు యతీశ్వరుడు.

చేసేదిలేక ఇంద్రతేజ ఇంటిముఖంపట్టాడు. చంద్రతేజ యతీశ్వరుని వద్ద కొన్నేళ్లు శిష్యరికం చేసి విద్యలన్నీ నేర్చుకుని తన నగరానికి చేరుకున్నాడు. నేర్చుకున్న విద్యలను సార్థకంచేసుకున్నాడు. వన మూలికలతో ప్రజలరోగాలు తగ్గించాడు. బాలబాలికలకు విద్యాబుద్ధులు నేర్పి ప్రజాసంక్షేమానికి పాటుపడ్డాడు.

-షేక్ అబ్దుల్ హకీం జాని, తెనాలి.





వార్త ఆదివారం

ఏమిటన్నది?

బాల గీతం



మల్లెచెట్టు మల్లెచెట్టు
ఏమిటన్నది
నీళ్లుపోస్తే పూవులన్ని
ఇస్తానన్నది
గున్నమావి గున్నమావి
ఏమిటన్నది
కోకిలమ్మ పాటలన్ని
నీకేనన్నది
కొండగాలి కొండగాలి
ఏమిటన్నది
అడవిపూల పరిమళాన్ని
తెస్తానన్నది
నల్లమబ్బు నల్లమబ్బు
ఏమిటన్నది
భూమిపైన వానజల్లయి
కురుస్తానన్నది
పంతులమ్మ పంతులమ్మ
ఏమిటన్నది
పిల్లలకు పాఠాలు
చెపుతానన్నది!

-తోట రామమోహన్
మైదుకూరు.

పదాన్వేషణ -17 జవాబు
1.BILL COLLECTOR
2.RED CARPET
3.SCREEN PLAY
4.BAD LUCK
5.WORLD MAP

హలో ఫ్రెండ్...



చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

కె.ప్రణవ్, నల్గొండ.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఎనిమిదో తరగతి చదువుతున్నాను. ఈమధ్య నేను బయో డైవర్సిటీ హాట్ స్పాట్స్ అనే మాట విన్నాను. అంటే ఏమిటి? దయచేసి దాని గురించి వివరించండి.

జవాబు: ప్రణవ్! జీవవైవిధ్యం పుష్కలంగా ఉన్న కొన్ని ప్రాంతాలలో మానవ తప్పిదాల వల్ల అక్కడి అనేకానేక జీవజాతులకు ముప్పువాటిల్లే ప్రమాదం ఏర్పడింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే కొంతకాలానికి అక్కడ జీవవైవిధ్యం పూర్తిగా అంతరిస్తుంది. అందువల్ల సత్వరమే చర్యలు తీసుకోవడానికి ముందుగా జీవ వైవిధ్యానికి ప్రమాదమున్న స్థావరాలను గుర్తించారు. జీవవైవిధ్యానికి ప్రమాదం ఉన్న స్థావరాలనే బయోడైవర్సిటీ హాట్ స్పాట్స్ అంటారు. ప్రపంచంలో ఉన్న 25 బయోడైవర్సిటీ హాట్ స్పాట్స్‌లో మనదేశంలోని ప్రాంతాలు చేరాయి. మన దేశం లోని పశ్చిమ కనుమలు, తూర్పు హిమాలయ ప్రాంతాలు కూడా హాట్ స్పాట్స్‌గా గుర్తించబడ్డాయి. పర్యావరణం కలుషితం కావడం, శీతోష్ణ స్థితులలో మార్పులు రావడం, గ్లోబల్ వార్మింగ్ స్థాయికి మించి పెరిగిపోవడం వలన ప్రపంచవ్యాప్తంగా నెలకొని ఉన్న కొన్ని సున్నితమైన జీవావరణ వ్యవస్థలకు ముప్పు వాటిల్లనున్నదని వాతావరణ మార్పులపై ప్రభుత్వం నియమించిన శాస్త్రవేత్తల కమిటి నిర్ధారించింది. మనదేశంలోని పశ్చిమ కనుమలు, తూర్పు హిమాలయ ప్రాంతాలలో జీవ వైవిధ్య సంపద ఎక్కువగా ఉంది. అలాగే ఎండమిక్ జాతులు కూడా అధికంగా ఉన్నాయి. పుష్పించే మొక్కలు, సీతాకోకచిలుకలు, ఆంఫీబియన్‌లు, సరీసృపాలు, క్షీరదాలు.. ఇలా అనేక జాతులు ఈ ప్రాంతాలలో సమృద్ధిగా ఉన్నాయి. అయితే మానవ తప్పిదాల వల్ల వీటికి ముప్పువాటిల్లింది. శాస్త్రవేత్తలు ఇటువంటి ప్రమాదం పొంచి ఉన్న జాతుల పట్టికను రూపొందించారు. వీటి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియచెప్పటం, వీటి సంరక్షణకు ప్రాముఖ్యతను కల్పించి, సంరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవడం లక్ష్యాలుగా కృషి జరుగుతోంది.

ఎన్.పావని, గుంటూరు.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఏడో తరగతి చదువుతున్నాను. భూగోళం వయసు ఎంత? దయచేసి చెప్పండి.

జవాబు: పావనీ! సౌరవ్యవస్థ ఎంతో పురాతనమైంది. ప్రాణికోటి ఆవిర్భవించటానికి ముందు అది దీర్ఘకాలం మార్పుకు లోనై ఉంటుందని, మన భూగోళం వయసు 460 కోట్ల సంవత్సరాలని శాస్త్రజ్ఞుల అంచనావేశారు.



అధిగమించవలసిన ఆరు భయాలు

భయం అనేది కేవలం ఒక మానసిక స్థితి (స్టేట్ ఆఫ్ మైండ్) మాత్రమే. దీనికి వేరే ఎక్కడా ఉనికి లేదు. ప్రాథమిక భయాలు ముఖ్యంగా ఆరు. ప్రతి మనిషి వీటిలో ఒక భయానికిగాని, కొన్ని భయాలకుగాని లోనవుతాడు. ఏ భయానికీలోనుగాని అదృష్టవంతుడు నూటికీ, కోటికీ ఏ ఒక్కడో ఉంటాడు.

ఆరు ప్రాథమిక భయాలు 1.దరిద్రభయం 2.అనారోగ్య భయం 3. ప్రేమను కోల్పోతాననే భయం 4.విమర్శ భయం 5.వృద్ధాప్య భయం 6.మృత్యు భయం.

దరిద్ర భయం:

మనిషి జీవితంలో అన్ని భయాల్లోకి దరిద్రభయమే అతణ్ని అన్నివిధాలుగా కుంగ దీస్తుంది. ఏ రంగంలోనైనా అతని సమర్థతను పెంపొందించుకుని రాణించటానికి ఈ భయం అడ్డుపడుతుంది. ఇది నిరాశను, నిరుత్సాహాన్ని కలిగించి, సంతోషాన్ని హరించివేస్తుంది. సమాజంలో ధనికులతో తను సమానంకాదనే ఆత్మన్యూనతను ఈ భయం మనిషికి కలగచేస్తుంది. ఇన్ని విధాలుగా మనిషికి చేటు చేసే ఈ భయాన్ని తొలగించటానికి మనిషి తన మనసులో దరిద్రానికి సంబంధించిన ఆలోచనల స్థానంలో సంపదకు సంబంధించిన ఆలోచనలను ప్రవేశపెట్టాలి. అయితే కేవలం ఆలోచనావిధానంలో మార్పు తెచ్చినంత మాత్రాన దరిద్రంపోయి సంపదలు లభిస్తాయా అనే అనుమానంతో అలా ప్రయత్నించటం భ్రమ అనిపించవచ్చు. కానీ ఈ మానసిక మార్పు మనిషిలో ఉత్సాహాన్ని, ఆశను కలిగించి ధనార్జనకు కావలసిన మార్గాలను అన్వేషింపజేస్తుంది. అప్పుడా మనిషి తన పట్టుదల, కృషితో దరిద్ర భయాన్ని అధిగమించి ధనికుడవుతాడు. ప్రపంచవ్యాప్తంగా దనికులైన చాలామంది జీవిగతాల్లో ఈ సత్యం రుజువయింది.

అనారోగ్య భయం:

కొంతమంది తమకు ఏ అనారోగ్యం లేక పోయినా తమ ఆరోగ్యంలో ఏదో లోపం ఉందని ఎప్పుడూ అనుకుంటూ ఉంటారు. వీరి అనారోగ్యం శారీరకం కాదు. అది మానసికం. ఇలా అనారోగ్యానికి సంబంధించిన ఆలోచన ఆరోగ్యవంతుని మనసులో చోటుచేసుకున్నప్పుడు మనస్తత్వ శాస్త్రం ప్రకారం ఆ చెడు ఆలోచన అతని సబ్ కాన్షస్ మైండ్ చేరుతుంది. ఈ మైండ్ అతి శక్తివంతమైంది. మంచిదిగాని, చెడుదిగాని ఏ ఆలోచనైనా దాన్ని చేరుకున్నప్పుడు ఆ ఆలోచనను క్రియలో ఆశ్చర్యకరంగా జరిపిస్తుంది... అందుచేత అనారోగ్య భయాన్ని నివారించటానికి ఆరోగ్యానికి సంబంధించిన మంచి ఆలోచనలకే చోటివ్వాలి. ఒక మనస్తత్వ శాస్త్రవేత్త తనని ఏ వ్యక్తి అయినా, 'మీరు బలహీనంగా చిక్కినట్లు కనిపిస్తున్నారు' అని మాటవరసకి అన్నా అటువంటి మాటలు చాలా హానికరం అని అన్నాడు. ఏ జబ్బు చేస్తే ఏ మందు వాడాలి అని ముందు జాగ్రత్తగా కనిపించే ఆలోచనలను మనసులోకి రానీయకూడదు. ప్రతి మనిషి తను సంపూర్ణ ఆరోగ్యవంతుడైనప్పుడు ఎలా ఉండాలని కోరుకుంటాడో ఆ



రూపాన్నే మనసులో నిలుపుకోవాలి. మనస్తత్వ శాస్త్రం ప్రకారం మనం తరచూ ఊహించిన మానసికరూపాలు, దృశ్యాలు వాస్తవిక మవుతాయి..

ప్రేమను కోల్పోతాననే భయం:

సాధారణంగా ఈ భయం యువతీయువకులైన ప్రేమికులలో కనిపిస్తుంది. త్రికరణ శుద్ధిగా ఒక వ్యక్తిని ప్రేమించినవాడు నిస్వార్థంగా ఆ వ్యక్తి సుఖసంతోషాలనే కోరుకుంటాడు. అటువంటి ఆదర్శప్రేమను ఎన్నడూ కోల్పోడు. ఈ సత్యం చరిత్రలో లైలా మజ్ను, పార్వతి దేవదాను, రోమియో జూలియట్‌ల వంటి ఉత్తమ ప్రేమికులలో రుజువైంది. తమ సంతానం మీద తల్లిదండ్రులప్రేమ, తమ తల్లిదండ్రులపై కొడుకులు, కూతుళ్ల ప్రేమ, ఇతర బంధువులపై ప్రేమ నిస్వార్థంగా వాళ్ల సుఖసంతోషాలను కోరుతుంది. ఈ ఉన్నత ప్రేమను ఎన్నడూ, ఎవరూ కోల్పోరు. ప్రేమ గురించి ఈ సరైన అవగాహన ఉన్న ఏ వ్యక్తికీ తను ఇతరుల ప్రేమను కోల్పోతాననే భయం ఉండదు.

విమర్శ భయం:

ఈ భయం చాలామంది జీవితాల్లో ఉండవలసిన ఎదుగుదలను నాశనం చేస్తుందని పరిశోధకులు చెపుతున్నారు. దృఢమైన మనోనిశ్చయంతో ఏ మనిషి అయినా ఇతరుల విమర్శలను పక్కనపెట్టి తన గమ్యం చేరుకున్నప్పుడు ముందుగా విమర్శించిన వాళ్లే అతనిని పొగడ్తలలో ముంచుతారు. వాస్తవిక దృష్టితో ఆలోచిస్తే విమర్శకులు తాత్కాలికంగానే విమర్శిస్తారు. వాళ్ల సొంత సమస్యలు ఎదురైనప్పుడుగాని, తమ అవసరమైన పనుల్లో తీరిక లేనప్పుడుగాని ఇతర్లను గురించి తాము చేసిన విమర్శలు మరచిపోతారు. ఉదాహరణకి, అమెరికాలో డెట్రాయిట్ నగరవీధుల్లో హెన్రీఫోర్డ్ మోటారుకారు కనుగొనే ప్రయత్నం చేస్తున్నప్పుడు అతణ్ని చూసినవాళ్లు 'ప్రాణంలేని వస్తువును కదిలేటట్లు చేయటం అసాధ్యం, తెలివితక్కువతనం' అని అతణ్ని విమర్శించి హేళనచేస్తూ నవ్వారు.

కానీ అతను వాళ్ల విమర్శలను లెక్కచేయకుండా 'నేను మోటారుకారుని కనుగొని నా కార్లతో ప్రపంచాన్ని నింపుతాను' అని సవాలు చేశాడు. తరువాత అతను ఎడతెగని కృషి, పట్టుదలతో మోటారుకారుని కనుగొని తన కార్ల పరిశ్రమను ప్రపంచవ్యాప్తంచేసి ప్రపంచంలోనే అందరినీ మించిన ధనవంతుడయ్యాడు. డెట్రాయిట్‌లో అతణ్ని విమర్శించినవాళ్లందరూ అతణ్ని ప్రశంసించారు. ఈనాటికీ ఫోర్డు కంపెనీ మోటారుకార్లకు ప్రసిద్ధి చెంది ఉంది.

ఇతరుల విమర్శలు నిర్మాణాత్మకమైనవి, మన గమ్యం చేరుకోవటానికి దోహదపడేవి అయితే ఆ విమర్శలను స్వీకరించి మన ప్రయత్నంలోని లోపాలను సరిదిద్దుకుని మన గమ్యం చేరుకునే దిశగా కొనసాగవచ్చు. కానీ వినాశకరమైన విమర్శలను మన మనోబలంతో ఖండించి విమర్శనాభయాన్ని వదిలిపెట్టాలి.

వృద్ధాప్య భయం:

వృద్ధాప్యం ఏ మనిషికైనా కాలగమనంతో అనివార్యంగా వస్తుంది. ఇది ప్రకృతి సహజం. కానీ వృద్ధాప్యం వలన వచ్చే ఉపయోగాలను అర్థం చేసుకుంటే ఈ భయం పోతుంది. బాల్యం, యవ్వనం, కౌమార దశల్లో తమ అనుభవాల ఆధారంగా వృద్ధాప్యంలో అడుగు పెట్టిన వ్యక్తి జీవితంలో నిజమైన విలువలను తెలుసుకోగలుగుతాడు. వృద్ధాప్యంలో ఉన్న మనిషి బంధుమిత్రులు, ఇతరుల నుంచి సమాజంలో గౌరవం పొందుతాడు. శ్రమ జీవితానికి స్వస్తి చెప్పి స్థిమితంగా విశ్రాంతి తీసుకుంటాడు. ఈ ఉపయోగాలను గుర్తిస్తే వృద్ధాప్య భయం ఉండదు.

6.మృత్యు భయం:

జాతస్య మరణం ధ్రువం..ఇది సృష్టిలోని సత్యం. దీని అర్థం పుట్టిన ప్రతి మనిషి

మరణించక తప్పదని. ఇది అందరికీ తెలిసిన సత్యమే. ప్రాణం పోకడ ఎవరికి, ఎప్పుడు, ఎక్కడ, ఎలా అనేది ఎవరికీ నిర్ధారణగా తెలియదు. అందుచేత మనకు కొంచెం కూడా అవగాహన లేని మృత్యువు గురించిన ఆలోచనలతో భయపడుతూ మనకు ఉన్న స్వల్ప జీవిత కాలాన్ని వృధాచేయటం సరైన పద్ధతికాదు. అలాకాకుండా జీవితాన్ని సార్థకం చేసుకుందామనే స్థిరసంకల్పంతో మృత్యువు గురించి ఆలోచించకుండా జీవితంలో ముందుకు సాగిపోవాలి. ఈవిధంగా మృత్యుభయాన్ని నివారించగలం.

ఈ ఆరుభయాలనుంచి విముక్తిని పొంది జీవితాన్ని సుఖమయం చేసుకోవటానికి ఎమిల్‌కో అనే ప్రసిద్ధ ఫ్రాన్స్ దేశపు మనస్తత్వ శాస్త్రవేత్త ఒక స్వీయ మనో సూచనను (ఆటో సజెషన్) రూపొందించాడు. ఆటో సజెషన్ అంటే మన మనసుకి మనమే ఒక సూచనను చేయటమని అర్థం. ఎమిల్‌కో మనకు అందించిన ఆటో సజెషన్ ఈవిధంగా ఉంది. 'Day by day, in every way I am getting better and better'.

దీని అర్థం నేను రోజురోజుకీ అన్నివిధాలుగా అభివృద్ధిచెందుతున్నాను'. దీనిని ఉపయోగించటానికి మడి, కట్టుబాట్లు, ఆచారాలతో అవసరంలేదు. కేవలం నమ్మకంతో మననం చేస్తే చాలు. ఏకాగ్రత కుదిరినప్పుడు ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎంతసేపయినా మానసికంగా ఈ స్వీయ మనో సూచనను మననం చేసుకోవచ్చు లేదా బాహ్యంగా ఉచ్ఛరించవచ్చు. ఇలా చేయటం వలన ఈ ఆటో సజెషన్ మన సబ్‌కాన్షస్ మైండ్ చేరుతుంది. అప్పుడు ఆశ్చర్యం కలిగించే అద్భుతాలను, సత్ఫలితాలను చూస్తాం.

ఈ ఆటో సజెషన్‌ను ఉపయోగించి ప్రపంచ వ్యాప్తంగా కొన్నివేలమంది ఉపయోగాలను పొందామని తమ అనుభవాల ఆధారంగా చెప్పారు. మనస్తత్వ శాస్త్ర చరిత్రలో ఒక అద్భుతమైన ఉదాహరణ ఉంది. పుట్టుకతో అంధుడైన ఒక బాలుడు కొంతకాలం ఈ ఆటో సజెషన్‌ని మననం చేయటం వలన ఒక ఉదయం అతను నిద్రనుంచి మేలుకునే సరికి ఆశ్చర్యానందాలను కలిగిస్తూ అతనికి చూపు వచ్చింది. ఇలా అద్భుతాలు అనేకమంది అనుభవాలలో ఈ ఆటో సజెషన్ వలన కలిగాయి.

కానీ ఈ కంప్యూటర్ యుగంలో మనిషికి ఒక సబ్ కాన్షస్ మైండ్ ఉంటుందనీ, మన మనసుకు చేసే స్వీయ సూచన దానిని చేరుకున్నప్పుడు కోరిన ఫలితాలు వస్తాయనేది సశాస్త్రీయం కాదనీ, కేవలం మూఢనమ్మకమనీ చాలామంది అనుకుంటారు. అలా అని వాదిస్తారు కూడా. కానీ అటువంటి నమ్మకం లేని వారికి కూడా కొన్ని భయాలు ఉంటాయి. వాటిని పోగొట్టుకోవటానికి నమ్మకంతో పనిలేని ఒక మానసిక పద్ధతి ఉంది. ఇది చాలా సులభం. చెడు ఆలోచనల స్థానంలో, మంచి ఆలోచనలను మనసులో ప్రవేశపెట్టటం, అంటే నెగెటివ్ థింకింగ్ స్థానంలో పాజిటివ్ థింకింగ్ ప్రవేశపెట్టటం. ఇలా పాజిటివ్ థింకింగ్ చేయటానికి ఎవరికీ అభ్యంతరం ఉండదు. నిజానికి ఆటో సజెషన్‌లో ఉన్న సారాంశమే పాజిటివ్ థింకింగ్‌లో ఉంది.

ఏవిధంగానైనా మనసును అదుపులో పెట్టుకుని మేలుచేసే ఆలోచనలతో ఆరుభయాలను తరిమికొట్టి మనం జీవితాన్ని సుఖమయం, సార్థకం చేసుకోగలం.

-కూచిభట్ల శ్రీనివాసశాస్త్రి

ప్రపంచం లోగిలిలో...

సాలీళ్ల పర్యావరణ సూచికలు!



అనంతమైన ప్రకృతిలో అనంత జీవరాశులు. అసంఖ్యాక జీవులు మనిషికి పరిచితమే అయినా మనిషి దృష్టికి రాని జీవులు ఎన్నెన్నో మిగిలే ఉన్నాయి. అదుగో, అలాంటి జీవులను కనుగొనేందుకు ఎందరెందరో శాస్త్రవేత్తలు నిరంతరం ప్రకృతితో మమేకమవుతూ, అన్వేషణ, పరిశోధన కొనసాగిస్తూనే ఉన్నారు. అలాటి యువ జంతుశాస్త్రవేత్తే ధ్రువ్ ప్రజాపతి. సాలీళ్లలో 6 కొత్త జాతులను కనుగొన్నందుకు అతడికి సాంక్చ్యువరీ ఆసియా వారి, యంగ్ నేచరలిస్ట్ అవార్డ్ 2016 లభించింది. భారత్‌లో జీవవైవిధ్యానికి ధ్రువ్ పరిశోధన ఎంతో తోడ్పడుతుంది.

గుజరాత్ యూనివర్సిటీ విద్యార్థి అయిన ధ్రువ్ ప్రజాపతి, పశ్చిమ కనుమల్లోని దట్టమైన అడవుల్లో తిరుగుతూ సాలీళ్లకోసం అన్వేషణ జరిపాడు. పర్యావరణం విషయంలో సాలీళ్లు సూచికలుగా ఉపయోగపడుతూయి. గాలిలో భారీస్థాయిలో ఉండే భారీ లోహకాలుష్యాన్ని ఈ సాలీళ్లు సూచిస్తాయి. అడవుల్లో ఉండే సాలీళ్లను బట్టి అక్కడ అడవి ఎండిపోయే ప్రమాదం ఉన్నట్లు మనం అర్థంచేసుకోవచ్చు. సాలీళ్లనుంచి వచ్చే జిగురు పదార్థంతో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను తయారుచేయటం తెలిసిందే. అధునాతన వైద్యంలో కూడా సాలీళ్ల పాత్ర ముఖ్యమైనదే అంటాడు యువ నేచరలిస్ట్ ధ్రువ్. 'గతం, భవిష్యత్తులను అర్థం చేసుకోవటానికి సాలీళ్లు కటకాల మాదిరి ఉపయోగపడతాయి. పర్యావరణాన్ని అర్థంచేసుకోవటానికి సాలీళ్లపై పరిశోధన అత్యంతావశ్యకం' అంటాడు ఆయన. ధ్రువ్ 77 వేర్వేరు జాతుల సాలీళ్లను గుర్తించాడు. ఆతర్వాత తాజాగా మరో ఆరు కొత్త జాతులను కనుగొన్నాడు. వాటిలో ఒకదానికి ఏపిజె అబ్దుల్ కలామ్ పేరు మీదుగా..'ట్రాపిజొడియమ్ కలామి' అని పేరుపెట్టాడు. ■



కథ

ఆ... కలిరాగం

- బి. లక్ష్మీనారాయణ

"ఎప్పుడూ యింతే ఈ మోహనకృష్ణ... అంతా హడావుడీ... ఆత్రమూనూ..."

ఇప్పటికిప్పుడు వచ్చిన ఆ 'గండగత్తర' ఏమిటంటే- మరో గంటా గంటన్నరలో 'ప్రయాణమట'. ఎక్కడికో, ఎందుకో చెప్పడుగాక చెప్పడు.

ఒక్క పది పదికొండు గంటల సమయం ఈ రోజుకి తనకు 'ప్రసాదిస్తే' తక్షణం మనముందు వాలిపోతాడట" అదీ యింతక్రితం వచ్చిన 'సంక్షిప్త సందేశం' లాంటి ఆదేశం లాంటి 'ఆంక్ష' కూడా అంతే బలంగా వుంటుంది. అది ఏది ఎంత పాళ్లనేది మళ్లా కేవలం మన 'మనసు' మనకున్న 'సమయమూ' మీదే ఆధారపడి ఉంటుంది.

నిజానికి యిప్పటికిప్పుడు నాకైతే ప్రత్యేకంగా ఏ పనీ లేదు. కానీ అస్సలు ఆలోచించుకునే సమయం అంటూ యివ్వకుండా తయారవడమంటేనే గొప్ప విసుగూ... తదితరాలూనూ.

అదీగాకుండా ఎందుకనో రాత్రంతా కంటిమీద కునుకనేది లేదు. అంటే నిదుర పట్టలేదు. కారణాలంటూ యిప్పటికప్పుడు ఏమీ ప్రత్యేకంగా చెప్పలేకపోయినా... కానీ నిద్ర పట్టలేదనేది మాత్రం నిజం.

ఆ యిబ్బంది ఉదయంమీద పడింది మరి. పైగా ఇంతలో యీయనగారి సంక్షిప్త 'ఆదేశం'. అయినా తప్పేదేముంది... తప్పే ముందని కూడా అనిపించింది.

ఈ మోహనకృష్ణ మన చిరకాల మిత్రుడూ, చిరంతన 'ఆలోచనా'మగ్నుడూ నిలువెత్తు నిర్మల వర్చస్సూ, గాత్రుడూనూ. పైగా 'తీవ్రమైన' అంతర్ముఖుడూనూ మిత్ర సమాజానికి యిప్పటి ప్రపంచానికి ఏమాత్రం అవసరం లేని విధంగా వర్తించే ప్రవర్తించే



'అనవసర' నేర్పున్న ప్రతిభాశాలి, ప్రభావశీలీనూ.

అందుకే 'అంతర్ముఖీ...సుఖీభవ' అంటూంటాను కలిసినప్పుడల్లా! తథాస్తు.

నిజానికి మేం కలిసి కూడా దాదాపుగా నెలవుతూంది కూడానూ. అందువల్ల... అందుచేత కూడా నేను ఈ ప్రయాణానికి తయారవడం అనేది జరిగింది (నిజానికి ఈ పందెం తెలుగులో ఎంత కృతకంగా వుందో చూడు కృష్ణా అసలు తయారవడం అనేది జరగడం ఏమిటట?)

ప్రత్యక్షమైన మరో అరగంటలో మహాత్మా గాంధీ బస్‌స్టేషన్లో అప్పటికే బయల్దేరడానికి సిద్ధంగా వున్న బస్ ఎక్కేసామిద్దరమూనూ (వివరాలు తనకు క్షుణ్ణంగా తెలిసుండడంవల్ల కదా అనుకున్నాను అప్పటికప్పుడే)

ఆ బస్ ఏదో అంటే ఎక్కడికి వెడుతుందో తదితరాలు నేనైతే చూడలేదు. ఎందుకంటే అప్పటికే సిద్ధంగా వుండడమూ కనీసం కాఫీ కూడా లేకుండా అంత ఆత్రంగా బస్‌లో కుదేయడంతో అంత అవసరం వుంటుందని యిప్పుడే కాదు మరెప్పుడూ అనుకోనవసరం లేదు.

సమయం కూడా గుర్తించనవసరం లేనంతగా కబుర్ల వడిలో పడి మధ్యలో రెండు సార్లనుకుంటా. ఎక్కడెక్కడో బస్టేషన్లలో ఆగడమూ మరలా ఎక్కడమూతో ప్రస్తుతానికి 'గమ్యం' తెలిసింది.

అదే మహాద్భాగ్యమనుకుంటూ... యింతకూ కార్యక్రమమేమిటి? మిత్రమా అనడిగాను. ఇంక అప్పటికి 'గమ్యం' చేరడానికి సరిగ్గా పదిహేను నిముషాలు సమయముంటుంది.

క్లుప్తంగా అయినా సవివరంగా తనకున్న 'అత్యవసర' పనులూ తను కలవాల్సిన వ్యక్తులూ అంటే కార్యాలయాధికారులూ తదితరాలన్నీ నివేదించి నన్ను అప్పటివరకూ వేధిస్తూన్న 'అగమ్య'... 'అగోచర' వ్యథకు చుక్క పెట్టేసాడు. అలవాటుగా చిన్నగా నవ్వుతూ.

అంటే కొంతవరకూ తనను అనుసరించగలగటమూ మరికొంత సమయం అనేకంటే అంతకంటే ఎక్కువే. వేచి వుండటమూ అనేది అవగతమయిపోయింది.

అయినా మొత్తమంతా కేవలం మూడూ మూడున్నర గంటల వ్యవధి మాత్రమే.

తనను... తనకు వదిలేస్తే మిగతాదంతా మరలా మామూలే. సశేషాలెరుగని కబుర్లతో సమక్షంలో సమస్తం అనుక్షణమూ ఒకరి మస్తకాన్ని మరొకరు నంజుకోవడానికి ఎడతెగని పాట్లూ.. అలవాట్లూ.. అబ్బో... ఎన్నెన్నో.. మరెన్నో! మరి యింక ఈ అనుసరించడాలూ.. వేచివుండటాలకూ మధ్యలో నా ప్రపంచం నాకు వుండనే వుంది. అది పరిశీలనా... విచారణా.. అదే 'చింతన్‌బైఠక్' విన్యాసం. నిర్వికారంగా నిర్విచారంగా, అనూచానంగా, అవిరళంగా.

ఆ క్రమంలో అలవాటైన నా నడకా, పరిశీలనా, పరిసరాల అవగాహనా తదితర తక్షణ కార్యక్రమం మొదలై అప్పటికి ఒక గంటన్నర పైగా అయుంటుంది.

ఆ దారంతా యింతకుముందే ఎవరో నడచినట్లుగా అనిపించడంతో ఒకింత ఆశ్చర్యపోవడంతో మరల మరలా మరింత పరిశీలనగా పర్యవేక్షించాను. అవును... నిజంగా ఆ దారంతా యింతకు ముందే ఎవరో నడచినట్లుగా బలంగా అనిపిస్తూంది. ఎందు కని? ఎందువల్ల? ఎందుచేత? యిప్పటి కప్పుడు ఎలా చెప్పాలి? అయినా ఎందుకలా అనిపిస్తోం దనేది అస్సలు తెలీడం లేదు. ఎందుకంటే ఎప్పుడూ లేదా యింకా ఖచ్చితంగా చెప్పాలంటే యింతవరకూ నేను ఆ ప్రాంతానికి ఎప్పుడూ వెళ్లలేదు. లేదా రాలేదు. మరి ఎందుకలా అనిపించడానికి గల కారణం నాకయితే అవగతం కావడం లేదు.

కానీ, అసలైనది... అతను అప్పటికి ఆ మార్గంలో చాలా సార్లే ప్రయాణించి వుండొచ్చు. కానీ మరి నాకెందుకలా అనిపించింది. అంటే మానసికంగా మా యిద్దరి మధ్యా ఏదో దగ్గరితనం వుందా? ఇనెహిబిషియన్. అది నిజమయితే ఒప్పుకోవడానికి నేను తీవ్రాతి తీవ్రంగా హైరాన పడాల్సి వచ్చేలా వుంది. అయినా ఆ వ్యక్తికి నిజంగా యివన్నీ తెలుసా అని. అతని ధోరణికి ఈ ప్రపంచం చాలా చిన్నదయినా కావాలి లేదా అతనికి ఈ ప్రపంచం గురించి ఏమాత్రమయినా పట్టింపు లేకుండా పోవాలి.

ఈ రోజే కదా! అదీ యీ మోహనకృష్ణ వల్ల కదా యీ ప్రాంతానికి తొట్టతొలిసారి లేదా మొదటిసారి కదా వచ్చాను.

మరి నగరంలోని యీ ప్రధాన రహదారంతా యింతక్రితమే ఎవరో ఎలా నడచివున్నారని అనిపిస్తూంది. అది కదా మనకిప్పుడు తక్షణం తెలియాల్సిన అవసరం వున్న లేదా తేలాల్సిన సమస్య.

అలా కాదని వెనక్కు తిరిగి నేను నడక మొదలుపెట్టిన చోటునించి మరలా పరిసరా లనూ, మనుష్యులనూ, వ్యాపార సముదాయాలూ, వాటి తీరుతెన్నులూ తదితరాలన్నీ మరల మరల చూసుకుంటూ వస్తున్నాను.

అవును... నిరంతరం ప్రవహిస్తూన్న ఈ జనారణ్యంలో నేనొక 'పిపీలకాన్ని' మాత్రమే. మరి, నాకు ఎందుకని అలా అనిపిస్తూంది.

అది తక్షణం తేలాల్సిన సమస్య. అయినప్పటికీ...

అవునూ... ఇంతకూ.. 'నేనొక పిపీలకాన్ని' అన్న తెలుగు పదాన్ని ఇంగ్లీషులోకి అనువదిస్తే... మిమిక్రీ అవుతుంది. ఖచ్చితంగా అవును కదా!

చిన్న భాషాసంకరం కూడా జోడిస్తే తెలుగులో రాసిన మిమిక్రీని తిరగేస్తే అప్పుడది 'క్రిమి' అంటే కీటకం కదా. మరి 'మి' అంటే (మరలా ఇంగ్లీషులో ఎమ్ ఇ=మి) యిప్పుడర్థమయ్యిందా మిమిక్రీ అంటే పిపీలకమని. అందువల్ల, అందుచేత నేను యింతకుముందు ఈ జనారణ్యంలోకి నేనొక పిపీలకాన్ననుకొన్నానని.

అవును... ఈ కళలో నేనొక 'పిపీలకాన్న'ని వికటించకు.

అందుకోసమని కనిపించే ప్రతీ శకలాన్నీ నిశితంగా పరికిస్తూ పరిశీలిస్తే పరిభ్రమిస్తూ పరిభ్రమిస్తూ, పరిమళిస్తూ, పరవశిస్తూ ఏదో వింత.. వింత లోకంలో వున్నట్లుగా భ్రమిస్తూ.. భ్రమిస్తూ నిరంతరంగా నడుస్తున్నాను..
నడుస్తున్నాను..దుస్తున్నాను..
స్తున్నాను..న్నాను..ను!

అయినా సమస్య అలానే వుంది. అసలు ఈ సమస్య మూలం ఏమిటో తెలిస్తే 'పరిష్కారం' ఆలోచించవచ్చు. మన పరిధిలోనిదైతే మరి ఆ మూలం అనేది ఎక్కడుందీ 'ఏ మూల'ని వెదకనూ.

అసలు సమస్యేమిటో తెలిస్తే వెతకొచ్చు. ఎంతసేపయినా.. కానీ.. అబ్బా..!

మరలా నాకు యింతకుముందు మొట్టమొదటిసారి అదే నేను నడుస్తూన్న దారంతా యింతకు ముందరే ఎవరో నడచినట్లుగా అనిపించిన చోటుకే వచ్చాను. అంటే దాదాపుగా ఆ రహదారిలో నలభై అయిదు నిమిషాలుగా నిరంతరాయంగా 'నడుస్తున్నానన్నమాట...' మంచిది.

మరి యింతకూ 'మన' మానవుడెక్క దున్నట్లో అనుకుంటూ.. ఒప్పందం ప్రకారం తనకు వీలయినప్పుడు 'తను' మాత్రమే నన్ను సంప్రదిస్తానన్నాడు మరి. అయినా అంతా చేసి యిప్పటికి తను వెళ్లి రెండున్నర గంటలు మాత్రమే అయింది కదా అని కూడా అనిపించింది కూడా యీ క్షణంలోనే.

"జీవితాన్ని అత్యంత దగ్గరగా చూసినవాళ్లు అయితే వేదాంతులవుతారు. లేదా పిచ్చివాళ్లవుతారని" ఎక్కడో చదివిన విషయం ఒక్కసారిగా జ్ఞాపకం వచ్చి వళ్లంతా జలదరించింది.

ఏమిటేమిటోలా వుంది మనసంతా ఏవేవో జ్ఞాపకాలతో గందరగోళంగానూ గజిబిజిగానూ కూడా వుంది.

అవునూ.. ఈ మనుషులంతా అంత వేగంగా... అనవసరంగా ఎక్కడికలా నిరంతరంగా ప్రవహిస్తూంటారు. కేవలం కేవలం బట్టలేసుకున్నంత మాత్రాన అందరూ మనుషులేనా? ఏమో? మనిషి అనడానికి ఏది ప్రమాణం. అయినా బట్టలేసుకున్న ప్రతీ 'జీవి' మనిషేనా? అంటే మనిషిని గుర్తించేది లేదా మనిషి గుర్తించబడేది కేవలం తను ధరించిన దుస్తుల వల్లనేనా? అవునేమో? కాదేమో?

ఏమిటో ప్రశ్నలూ.. సమాధానమవసరం లేని పరిమాణంలో నిత్యక్రతువులాంటి ఈ యజ్ఞం ఆలోచనామగ్నమైన నా కన్నులీవేళ తీవ్రంగా చలించిపోతున్నాయి... సంచలించి పోతున్నాయి. ఎందుకు? ఎందుకని?

గత గంటంపావు అవిరళ నడక క్రమంలో నేను గమనించింది ఏమిటంటే- సరే పరిసరాలను అలా వుంచితే మనుషుల ప్రవాహంలోని 'వేగం' ముఖ్యమయినది.

ఏవేవో బస్సులొస్తున్నాయి.... వెడుతున్నాయి. ఎక్కేవాళ్లు ఎక్కుతున్నారు. మరి దిగేవాళ్లు దిగుతున్నారు. రోడ్లన్నీ రద్దీ రద్దీగానే వున్నాయి. క్రమంగా ఆ రద్దీ పెరుగుతూంది కూడానూ సమయం గడిచేకొద్దీ.

అయినప్పటికీ మారనిది కేవలం ఒక్కటే. అది ముఖ్యంగా నేను. అవును నేను మాత్రమే ఏం మారలేదు. ఏమారలేదు. ఎందుకంటే నేను మాత్రమే ఈ ప్రాంతంలో గత కొంత కాలంగా నిలిచివున్న 'జీవ', 'నిశ్శబ్ద' ఆకృతిని కేవలం నా కనుచూపు ప్రసరించినత మేరా పరిసరాలను నిశితంగా గమనించేవి నా కళ్లు మాత్రమే.

అవును... నాకు తోడుగా నా దృష్టిని ఆకట్టుకున్న ఆ వ్యక్తి అవును.. నా అనంత వేగ సమస్యకు కారణమైన ఆ వ్యక్తి... ఆ వ్యక్తే ఎందుకలా ప్రత్యేకంగా నాకు కనిపిస్తున్నాడో కదా అని కూడా అనిపిస్తూంది.

కానీ, అసలైనది... అతను అప్పటికి ఆ మార్గంలో చాలా సార్లే ప్రయాణించి వుండొచ్చు. కానీ మరి నాకెందుకలా అనిపించింది. అంటే మానసికంగా మా యిద్దరిమధ్యా ఏదో దగ్గరితనం వుందా? ఇనెహిబిషియన్. అది నిజమయితే ఒప్పుకోవడానికి నేను తీవ్రాతి తీవ్రంగా హైరాన పడాల్సి వచ్చేలా వుంది.

అయినా ఆ వ్యక్తికి నిజంగా యివన్నీ తెలుసా అని. అతని ధోరణికి ఈ ప్రపంచం చాలా చిన్నదయినా కావాలి లేదా అతనికి ఈ ప్రపంచం గురించి ఏమాత్రమయినా పట్టింపు లేకుండా పోవాలి.

ఆ వ్యక్తి చాలా తీవ్రమయిన పనుల వత్తిడిలో వున్నట్లు ఈ రహదారికి ఇరుపక్కలా వున్న ప్రతీ దుకాణమూ, ఎదురయ్యే ప్రతీ అగంతక వ్యక్తినీ చెయ్యి చాచి 'అడుగుతూన్న' మనిషిని వ్యక్తి అనొచ్చా? ఏమో!

ఎందుకంటే మామూలు కంటికి లేదా సమాజాన్ని ఏమాత్రం పట్టించుకోని లేదా సమాజం ఏమాత్రమూ పట్టించుకోనవసరం లేని ఆ 'మనిషి' పైగా ఎవ్వరూ కూడా చెయ్యి చాచిన అతగాడి చేతిలో ఏమాత్రమూ 'విదల్చని' సామాజికులే.. సంస్కారవంతులే.

"ఒక మనిషి తన సహచరుల అడుగులతో అడుగు కలపలేకపోతున్నాడంటే ఎవరికి తెలుసు, అతను మరో రకమైన నాదం వింటున్నాడేమో, తను వింటున్న సంగీతం వైపే అతను అడుగేయాలి. అదెంత దూరంలో వున్నా సరే"

పైగా ఆ మనిషిని కేవలం 'అడుక్కునే' వానిగాకంటే 'పిచ్చివానిగా' ముద్ర వేసినందు వల్ల కూడా మాత్రమే అతడిని అందరూ విదుల్చుకునేవారే.. కసురుకునేవాళ్లే.. అసహ్యించుకునేవాళ్లే.

ఆ మనిషి వొంటిమీదున్నవి 'బట్టలు' అని చెప్పడంకంటే కేవలం పీలికలు అనడం కొంతవరకూ సరిపోతుంది.

ఆ మనిషి చేష్టలు లేదా శరీర భాష అంతా కూడా 'కొంత' విభ్రమంగానూ, అనూహ్యంగానూ వుంది. 'అసహ్యం' సరేసరి. అయినా సరే 'ఏదో ప్రత్యేకత' ఆ కళ్లల్లో... అవును చూసే కనులుండాలేగానీ ఆ కళ్ల చెప్పే సంగతులు ప్చ్... అంత అదృష్టమయితే నాకు లేదు. ఎందుకంటే కేవలం 'సమయా' భావం. కానీ నిజం. అతగాని కళ్లల్లో 'ఏదో' తెలియని 'వెలుతురు' లేదా 'వెలుగు'న్నదనిపిస్తూంది. కానీ...

క్రమంగా ఆ చివర నుంచి కేవలం రహదారికి ఇరుపక్కలా ప్రతీ దుకాణమూ, తనకెదురయిన ప్రతీ వ్యక్తినీ చేయి చాచి ఏదో అడగడమయితే నా దృష్టిలో పడుతోంది. కానీ అతను 'ప్రతిగా' ఏమంటున్నదీ తెలియడం లేదు. అసలంటూ ఏదన్నా అంటున్నాడా? ఎండిన ఆ సన్నటి పెదవులు అసలంటూ విచ్చుకుంటున్నాయా? ఎలాగైనా సరే కోపంగానో, బాధగానో, ఆకలిగానో...

"ఎవరి జీవితమయినా సరే ఆలోచించదగ్గదయితే అది కచ్చితంగా రాయదగ్గదే" అవుతుంది కూడా అనిపించింది. క్రమంగా ఆ మనిషి నా ఆలోచనల్లోనూ, భౌతికంగా కూడా తగుమాత్రంగానే అయినా 'చేరువవుతున్నాడు' లేదా సమీపిస్తున్నాడు.

అవును, అతను నా దృష్టిలో అగంతకుడు ఏమాత్రం కాదు. ఏదో మారు వేషం వేసుకున్న 'మరో లోకం' మనిషి. కానీ కచ్చితంగా 'అధో లోకం' మనిషి మాత్రం కాదు.

ఎందుకంటే ఆ మనిషి 'నడకలోనూ, మొహంలోనూ స్పష్టంగా కనిపిస్తున్న ఆ 'ప్రత్యేకతే'.

ఎక్కడో... ఎప్పుడో.. ఎందువల్లనో 'వ్యక్తి' వల్లనో లేదా మనకు ఏమాత్రం తెలియని పరిస్థితుల ప్రాబల్యంవల్ల మాత్రమే ఆ మనిషి ఈ ప్రస్తుత స్థితి అనిపిస్తూంది. పైగా అతని మొహంలో కనిపించే ఆ వర్చస్సును బట్టి చూసినా సరే.

వెలుగుతూన్న ఆ వదనంలో మనకు కనిపించేది కేవలం 'ఆనందం' మాత్రమే అనొచ్చనుకుంటాను. అందువల్ల అందుచేత అతను 'కేవలం' అందరూ అంటున్నట్లు లేదా అనుకొంటున్నట్లు పిచ్చివాడు కాదు... కాదు. ఎందుకంటే "ఆనందంగా వుండే వాళ్లందరూ .... దిగులుగా వుండేవాళ్లకంటే ఎక్కువ వేదననీ అనుభవించి వుంటారు" అనేది ఆ మనిషిని చూస్తే కచ్చితంగా అనిపిస్తూంది.

ఆ మనిషి వచ్చేస్తున్నాడు. అందరినీ అడుగుతున్నట్లే నన్ను కూడా అడుగుతాడా? అయితే ఏమనడుగుతాడు.. అందరినీ అడిగినట్లేనా... ఎందుకు నాకీ 'విచికిత్స'.

అదేమిటీ.. అలా వెళ్లిపోతున్నాడేమిటీ.. నన్ను అడగకుండానే పైగా ఆ చూపేమిటీ... ఎందుకని అలా చెయ్యాపుతున్నాడు.

"ఆనందం అనేది మనం చేరుకోవాల్సిన ప్రాంతం కాదు. అది మనం సృష్టించుకునే ఒక మానసిక స్థితి" మాత్రమే.

ఆలోచనల్లో పడి గమనించలేదు కానీ... ఆ మనిషి యింతకుముందు కూడా అడుగుతూన్న ప్రతీ వ్యక్తినీ లేదా వ్యక్తి దగ్గరనుంచి ముందుకు వస్తూ ఏదో అంటూ వెళ్లిపోతున్నాడు.

అదేమిటీ... నా ముందున్న వాళ్లను చెయ్యి చాచి అడిగినప్పుడు వాళ్ల 'తగు' మాత్రంగా స్పందించకపోవడంతో..

"మీ బతుకులు మీవి.. మా మెతుకులు మావి" అంటూన్నప్పుడు కూడా మొహంలో కనిపించే ఆ ఆనందం నిజంగా కనిపించేది 'ఆనందమేనా' భ్రమిస్తున్నానా...

అయినా నన్ను అడగకుండా అలా చూస్తూ ఎందుకని చెయ్యాపుతూ వెళ్లిపోతున్నాడు.

పైగా పదే పదే అదే అచ్చం అల్లాగే ఎక్కడినుంచో అనంతమైన లోయలలోంచి సుదూరమైన అగడ్తలలో నుంచి క్రమం తప్పక నిరంతరం ప్రవహించే జీవజలాల వురవడీ.. ప్రవాహంలా.. ప్రకృతి ఆలపించే 'ప్రతిధ్వని'లా అలా.. అలా... ఎంత లోతయిన.. పైగా అంతే బరువయిన.. ఆనంద ప్రకటనది.. అమ్మో.. తట్టుకోలేకపోతున్నాను.

ఎక్కడ నేర్చుకున్నాడు.. ఎలా.. ఎక్కణ్ణించి.. ఎక్కడకు అలా ప్రవహిస్తూన్నాడు, ఏమో!

అది విన్నాకయినా ఆ మనిషి గురించిన మన ఆలోచననీ, దృష్టి మారాల్సిన... మారాల్సిన ఆవశ్యకత ఎంతుందో అవగతమవుతూన్న కొలదీ గుండెలు ద్రవించిపోతున్నాయి.

అవును.. యిప్పుడు మనమే... అవును యిప్పుడు మనమే కేవలం భిక్షగాళ్లం. 'దుస్తులేసుకున్న సామాజిక భిక్షగాళ్లం'. లేదా ఏవేవో ఆశల వెంట పడి పరుగులిడుతూన్నవాళ్లం.

ఆనందం కోసమంటూ ఎక్కడెక్కడకో వెడుతూ.. వెడుతూ... వెతుకుతూ... ఏ అనంత తీరాలకో... ప్చ్.

ఇంక ఆ మనిషి యింకెంతమాత్రమూ భిక్షగాడు కాదు. అలాగని పిచ్చివాడు కూడా కాదు. కాదు.. కాకూడదు.

అప్పట్నుంచి ఎందుకో నన్ను వెంటాడుతూన్న అతగాని రూపం వ్యక్తపరచిన ఆ భావం...

అవును.. ఎవరో.. ఎక్కడో.. ఎప్పుడో అన్నట్లుగా.

"మన మనసు సంపన్నం కాకపోతే ఐశ్వర్యం అన్నది ఒక వికారమైన భిక్షగాడి లాంటిది"

దూరంగా బస్సులోంచి మోహనకృష్ణ పిలుస్తున్నాడు, ఎప్పుడు వచ్చాడో.. ఎప్పుడు బస్సు ఎక్కాడో.

"ఎప్పుడూ యింతే.. అంతా హడావుడీ.. ఆత్రమూనూ.." ■

కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టులనుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతోపాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

ఎడిటర్, ఆదివారం వార్త నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

ఈ వారం కవిత్వం

అవతారమూర్తి



నీవు నడచిన చోట
శాంతిపూలను
పరిచావట
నీవు పలకరించిన చోట
అహింసామృతం చిలికించావట
ప్రజాదాస్య విమోచనానికి
ఉద్యమం నడిపావట
నీ బోసి నవ్వులతో
జనహృదయాలను దోచావట
నీ ఆలోచనలు సర్వసమ్మతమై
ఎందరెందరికో సిద్ధాంతాలై
'జాతిపిత'గా నిన్ను కొలుస్తున్నారట.
భావితరాలకు మార్గదర్శకమై
'గాంధేయం' రెపరెపలాడే పతాకమైందట.
బుద్ధుని బోధల మర్మమెరిగి
భారతావని ఆత్మగౌరవం నిలిపిన
'అవతారమూర్తివి' నీవే మహాత్మా!
అమర్ రహే బాపూ!
అందుకో మా వందనం!!

– డా॥ యిమ్మిడిశెట్టి చక్రపాణి

అక్షర స్నేహం

మిత్రులందరూ మోసం చేశారు
బంధువులందరూ దూరమయ్యారు
కావలసినవారు కరువయ్యారు.
నా అన్నవారు లేరు
రా... అన్నవారు అసలే లేరు.
పోయినవారు తిరిగిరాకున్నారు.
ఆర్థిక యిబ్బందులు అతలాకుతలం చేస్తున్నాయి.
అయినవారు ఆడిపోసుకుంటున్నారు.
సవాలక్ష సమస్యలు చుట్టుముట్టాయి.
గుండెల్లో గునపాలు దిగుతున్నాయి
హృదయంలో సూదులు దిగుతున్నాయి
మోడువారిన మనసు మూగరోదనతో వుంది.
పాత స్నేహితుడ్ని పలకరించాను
పుస్తకం తీసి చదువుకున్నాను.
మనసు తేలికయ్యింది.
కవిత రాశాను.. ఆశలు చిగురించి
ఆనందం ఆత్మస్థైర్యాన్ని యిచ్చింది.
కథను రాశాను. కల్మశం లేని
కథనం నన్ను కడవరకూ నడుపుతానంది.
మనసంతా పుండుగా వుంది... కానీ
కవితలు... కథలు రాయగానే
పుండు పువ్వైపోయింది.
నిరాశ పోయి ఉషారు మొదలయ్యింది.
అక్షర స్నేహంలో ఆనందమే వేరనిపించింది.

– ఎం.వి. స్వామి

కవిత ఏర్పడదు

Accident spotలా వున్న
జీవితంలో ప్రతివొక్కడూ క్షతగాత్రుడే-
కాల ప్రవాహంలో రుతువులు
దొర్లుకొంటూ పోతాయి తాటి బుర్రల్లా
వొకదాని వెంట మరొకటి.
చెట్లు పెద్దవై ఫలవృక్షాలవుతాయి
మనిషికి నీడ, మనుగడనిస్తూ
పండుటాకులు రాలి పడిపోతుంటాయి
కొత్త చిగుళ్లతో పునఃసృష్టికోసం
చెట్లపై నుంచి పోయే మేఘాలు
పుష్కర ఘాట్లను చూడవు
వర్షించి జన హర్షం కలిగించాలని
భూమి మట్టిని సుసంపన్నం చేస్తూ
మనిషి జన్మను నిలబెట్టాలని
ప్రసవ వేదన పడుతుంటాయి.
నేలబారునున్నంత మాత్రాన
మేఘాలు కురవ్వు
కొంత సాధన మరికొంత సంవేదనా
లేనిదే కవిత ఏర్పడదు.

– భూషి కృష్ణదాసు

రచనలకు ఆహ్వానం

రచయితలనుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతోపాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. **రచనలు పంపించాల్సిన చిరునామా:**
ఎడిటర్, ఆదివారం వార్త నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80



'స్వచ్ఛ'భారత్!

- యస్.వివేకానంద

నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకున్న మాధవరావ్ కాఫీ సేవించి, వంటికున్న బనీనుపై షర్ట్ తొడిగి కట్టుకున్న లుంగీతోనే మూలనున్న చీపురు పట్టుకుని వీధిలోకి వెళ్లబోయాడు. వీధివాకిట్లో కళ్లాపి చల్లి, ముగ్గు వేసిన అనన్య, భర్త తనకు ఎదురు రావటం చూచింది.

'ఏమిటీ ఈ అవతారం? చేతులో ఆ చీపురు దేనికి? మగాళ్లు చీపురు చేతపూన రాదు. ఇంటికి అరిష్టం. దాన్ని ఆ మూలన పెట్టి ఇంట్లోకి నడవండి' ఆజ్ఞాపించినట్టే మాట్లాడింది.

భార్య నోటినుండి ఆ మాట రాగానే మాధవరావు ఖంగుతిన్నాడు.

'స్వచ్ఛ' భారత్ వచ్చేసింది కదా! ఇక మగ, ఆడ తేడా లేకుండా అందరూ వీధులు వూడ్చే కార్యక్రమంలో పాల్గొనాలి! ప్రజాసేవ చేస్తే కాస్తంతైనా పుణ్యం అంటి, స్వర్గానికి వెడతాం. మానవసేవే మాధవ సేవ కదా చిట్టీ!?' మనసులో మాట వెళ్లగక్కేను.

'తమరు మాధవుడే కావచ్చు. అంతమాత్రాన సేవ చేయటమంటే చీపురు, చేట పట్టుకుని వీధులు వూడ్చటాన్ని ప్రజాసేవ అనరు' అంది అనన్య.

'మన ఇల్లు మనం వూడ్చుకుని శుభ్రం చేసుకుంటున్నామా? లేదా?' 'అయితే? వీధులూ వూడుస్తారా?' ఎవరు ఏ పని చేయాలో వారే చేయాలి.. అన్ని పనులూ అందరూ చేయరాదు. ఈ మాత్రం తెలీదా?'

'అది కాదే.. నలుగురితో నారాయణ.. కులంతో గోవిందా అన్నారు! ఎందరో మహానుభావులు రోడ్డు, వీధులు శుభ్రం చేసే పనికి పూనుకుంటుంటే ఆ పని నేను చేస్తే ఏం పోతుంది'

'వాడకట్టులో మనకున్న గౌరవం, మర్యాద మట్టి కలిసిపోతుంది. ఆడ, మగ అంతా నవ్విపోరూ!' రెండు అంటించింది అనన్య.

'అది కాదే...'

'మీరు అంతగా ఊడ్వాలని ముచ్చటపడితే రేపటినుండి మీరే ఇల్లంతా వూడ్చి శుభ్రం చేసి తడిగుడ్డతో తుడవండి! అంతేగానీ వీధులూడ్చటం గొప్ప కాదు. మగాడు కలం చేత పట్టుకోవాలి. ఆడది చీపురు పట్టాలంటారు!'.

'ఒసి పిచ్చిమొద్దూ! ఒకప్పుడు 'భూదాన' కార్యక్రమం చేపట్టిన ప్రభుత్వం 'స్వచ్ఛ' భారత్ పేరుతో నేడు శ్రమదాన కార్యక్రమం చేపట్టింది. ఇది దేశవ్యాప్తంగా వైరస్ ఫీవర్‌లా పాకింది! నన్నూ ఓ చెయ్యి వేసి కార్యక్రమంలో పాలుపంచుకోని' నచ్చచెప్పాడు మాధవరావ్'

'మీరు వెయ్యి చెప్పండి... లక్ష చెప్పండి... మీరు చీపురుతో వీధిలో కెళ్లటానికి నేను ససేమిరా వప్పుకోను గాక వప్పుకోను'.

'చూడూ! నీవేనాడైనా పేపరు చదివేడిస్తేగా! ప్రధానమంత్రి మొదలు.. ముఖ్యమంత్రులు, ఐ.ఏ.ఎస్‌లు, ఐ.పి.ఎస్‌లు ఇతర ఉన్నతాధికారులు సైతం ఈ బృహత్తర 'అచ్ఛా' భారత కార్యక్రమంలో పాల్గొనగా లేనిది ఆఫ్ట్రాల్ నేనెంత?' ఓ అడుగు ముందుకేశాడు మాధవరావ్.

రెండు చేతులూ చాచి భర్తను అడ్డుకుంది. 'చెప్పేది చెవినేసుకో! మున్సిపల్ కమిషనర్లు వారి సిబ్బంది, పేరు పేరున ఎందరో పాల్గొంటున్న ప్రజా ఉద్యమమే ఇది. అరచేతిని అడ్డుపెట్టి సూర్యుడ్ని ఎలా ఆపలేవో ఇదీ అంతే! నువ్వు ఔనన్నా.. కాదన్నా వెళ్లితీరుతాను' మొండికెత్తాడు మాధవరావ్.

'మీరిలాంటి పన్లకు పాల్పడతారని నేనేనాడూ వూహించలేదు. ఈ విషయం ముందే తెల్సివుంటే మీచేత మెడలో మూడు ముళ్లూ వేయించుకునేదాన్ని కాదు. కన్యగానే వుండిపోయేదాన్ని! మా డాడీకి కట్నం ఖర్చూ లేకుండా వుండేది. అంతా నా ప్రారబ్ధ కర్మ' లెంపలేసుకుంది. తాను మాధవరావుని పెళ్లాడి ఘోర అపరాధం చేసినదానిలా!

'మగాళ్లే కాదే... ఆడాళ్లూ స్వచ్ఛంధంగా 'స్వచ్ఛ' భారత్ కార్యక్రమంలో కోట్లాది మంది పాలు పంచుకుంటున్నారే'.

'ఆహాఁ... మీరు తప్ప మన వీధిలో మగాళ్లు ఇళ్లల్లోంచి బైటికొచ్చి ఈ పనికి పూనుకోవటం లేదేం?'

నాకు తెల్సు. మీరు జవాబు చెప్పలేరు. వారంతా కలిగినవాళ్లు, ఆఫీసర్లు హోదా కలవాళ్లు. రోడ్లు ఊడ్చాల్సిన ఖర్మ వాళ్లకేం పట్టిందనుకున్నారేమో!' దీర్ఘాలు తీసింది అనన్య వెటకారంగా.

'నా మాట వినీ నువ్వూ చీపురు చేత పూని నా వెంట వస్తే వీధిలో మన లెవల్ పెరుగుతుందే.. కాదనకు'.

'నేను చచ్చినా ఆ వెధవ పని చేయను. మిమ్మల్ని చేయనివ్వను'.

'ఇలానే ప్రతిఒక్కరూ మొండికేస్తే దేశంగతి ఏమైపోతోందో ఒక్క క్షణం ఆలోచించు? ఈ పరిశుభ్రత పని కుల, మత, వర్గ భేదాలు లేకుండా చేస్తుంటేనే దేశం యావత్తు పరిశుభ్రంగా, నీట్‌గా, గుడ్ లుకింగ్‌గా వుంటుంది. అప్పుడు దేశంలో అనారోగ్యాలంటూ వుండవ్. కుక్కలు, పందులూ వీధుల్లోకి విసిరేయబడిన వాటికోసం కోట్లాడుకుని వేస్ట్ గార్బేజ్‌ని చిందరవందరగ, రోడ్లను, వీధులను అపరిశుభ్రంగా చేయగల అవకాశం వాటికి వుండదు. పరిస్థితిని అర్థం చేసుకోవే! ఆడాళ్లు మగాళ్లను పోనీకుండా అడ్డుకున్నా ఈ కార్యక్రమంలో వారు పాలు పంచుకోకున్నా ప్రభుత్వం అలాంటి వారిని తిరుపతి ఈడ్చుకెళ్లి బలవంతాన శిరోముండనం చేయించినా చేయిస్తారు. కొప్పులు పోయినందుకు జడ వేసుకుని పూలు పెట్టుకోలేకపోయామని అప్పుడు... అప్పుడు ఏడ్చి ఏం ప్రయోజనం?'

'అంతేనంటారా?' భర్త మాటకి విస్తుపోయిన అనన్య తలొంచుకుంది'.

'అంతే కాదే! మగాడు ఉద్యోగస్తుడైతే ఆఫీసు వేళల్లో ఒక గంట ఈ 'అచ్ఛా-స్వచ్ఛా' భారత్ కార్యక్రమంలో తప్పక పాల్గొనేట్లు చేస్తారట'

'నిజంగానా?'

'లోకం తెలియని పిచ్చిమొద్దువు! నువ్వు డిగ్రీ చదివినా నీకు లోకజ్ఞానం శూన్యం'

'మరైతే మన వీధిలోగల మిగతా ఆడవారి సంగతేంటి?'

'ఒకరి సంగతి మనకేల? మన వంతు సేవ మనం చేద్దాం... దట్సాల్!'

'అది సరే కేటాయించిన గంట సమయంలో ఉద్యోగస్తులు 'స్వచ్ఛ' భారత్‌లో పాల్గొనకపోతే వారినేం చేయబోతారట?' డౌట్ క్లియర్ చేసుకోవాలని ప్రశ్నించింది భర్తను.

'నీకు ఇంకో విషయం తెల్సా? అలాంటి వారికి ఏడాదికోమారిచ్చే ఇంక్రిమెంట్ కట్ చేయబోతున్నారట! రాబోయే ప్రమోషన్లు ఇవ్వరట. మొండికేసిన వారిని కింది స్థాయి పోస్ట్‌కి రివర్ట్ చేస్తారట!'

'అట్లా చేస్తే ఉద్యోగులేం వూరుకోరు...'

'ఏం చేస్తారే... అది ప్రభుత్వ నిర్ణయమైనప్పుడు?'

'ప్రతిఘటించి ఆఫీసుల ముందు ధర్నాలు చేయచ్చు. నిరాహార దీక్షలకు పూనుకోవచ్చు. న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఏదైనా చేస్తారు' తెలివినుపయోగించి ఆర్గ్యూ చేసింది, భర్తతో.

'ఇలాంటివి జరగకుండా వుండాలనే కేంద్రం 'ఆర్డినెన్స్' తేబోయే ప్రయత్నం చేస్తోందని న్యూస్ పేపర్లు సేకరించిన భోగట్టా! ఇప్పుడు అర్థమైందా? నయానా భయానా స్వచ్ఛంధంగా 'స్వచ్ఛ భారత్' కార్యక్రమంలో పాల్గొననివారి తిక్క ఈ విధంగా కుదర్చబోతోంది. అండర్‌స్టాండ్!!'

'మీరు మాట్లాడేదేంటో నాకు ఒక్క ముక్క అర్థమై చావటం లేదు' బుర్ర గోక్కుంది.

'ఈ కార్యక్రమంలో పాల్గొని మన వంతు కర్తవ్యాన్ని నిర్వహించకపోతే నాకు ఉద్యోగమూ ఊడుతుంది. నీకు గుండు చేయాల్సి వస్తుంది. ఇప్పుడు చెప్పు నీ నిర్ణయం ఏంటో? నేనొక్కడినే పోవటానికి పర్మిషన్ ఇస్తావా? లేదూ నువ్వు నాతో వస్తావా?'

ఈ విధంగా భర్త తనను ఇరకాటంలో పెట్టటం అనన్యకు అస్సలు నచ్చలేదు. మనిషిలో భయం ఏర్పడింది. అమ్మో! భర్తను ఉద్యోగం నుండి బర్తరఫ్ చేస్తే స్వయంకృతాపరాధమై నోట మట్టి కొట్టుకోవాల్సి వస్తుందేమోననే శంక ఒకవైపు; తన అందమైన పొడవాటి శిరోజాలు తనకు దక్కకుండా పోతాయేమోననే భయం మరోవైపు అనన్యను పీక్కుతినసాగేయి. ఇక మాట్లాడి ప్రయోజనం వుండదనిపించి తనూ భర్తతోపాటు చీపురు చేత పూని స్వచ్ఛంధంగా 'స్వచ్ఛభారత్' కార్యక్రమంలో పాల్గొనేటందుకై ఇంటికి తాళం బిగించి భార్యాభర్తలిరువురూ వీధిలోకి నడిచారు, అన్ని దానాలకన్నా శ్రమదానమే మిన్న అనుకున్న దంపతులిద్దరు.

వీధిలోని వారంతా వీరిని అనుసరించటం మరో విశేషం!

'జై స్వచ్ఛభారత్! జిందాబాద్ స్వచ్ఛభారత్!!' ■

‘కుట్టక వేధ’ గురించి తెలుసుకునే ముందు ‘భూగృహం’ గురించి తెలుసుకోవాలి. భూమి అడుగు భాగంలో పైకి కనిపించకుండా నిర్మించిన గృహాలను ‘భూగృహాలు’ అంటారు.

భూమి ఉపరితలానికి కొన్ని అడుగులు కిందకి, కొన్ని అడుగులు పైకి వచ్చే (కనపడేలా) విధంగా నిర్మించే గృహాలను ‘సెల్లార్స్’ అంటారు. సాధారణంగా సెల్లార్స్‌ని అనారోగ్య బాధలను కలుగజేస్తుంది. యక్ష, రాక్షస, వినాయక, గ్రహ, భూత, ప్రేత, పిశాచ, బ్రహ్మ రాక్షసాది భూతాల ఆవేశంచేత అక్కడ నివసించేవారు ఇలాంటి బాధలను, పీడలను, అనారోగ్యాన్ని పొందుతారన్న భావం కూడా ఉన్నది. కష్టం ఏదయిన ప్పటికీ, కారణమొక్కటే. ‘కుట్టక వేధ’ ఇలాంటి వేధలను సాంకేతికపరంగా సరిచేసుకోవటానికి చాలా సందర్భాలలో వీలు కాదు.

వాస్తువార్త

వాస్తువిద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్- 3
సెల్స్: 9885446501/ 9885449458



అనే దోషాన్ని కలిగివుంటుందో ఆ గృహ యజమానికి, అందులో నివసించేవారికి మృత్యువు కలుగచేయును, లేక దరిద్రులుగా చేయును. ‘సుప్తక వేధ’ అంటే ఏమిటి? సుప్తము అనగా నిద్రించుట లేదా సమస్యలను ముఖ్యంగా అందవిహీనులుగా చేసే దుష్ఫలితాలు కలిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుత సమాజంలో దాదాపు ప్రతి గృహం కూడా స్తంభాలతో (పిల్లర్స్)తోనే నిర్మిస్తున్నారు. కనుక గృహాలను ఇలాంటి ‘శంకపాల వేధ) దోషం కలిగే అవకాశం తక్కువ.

పాత కాలంలో నిర్మించిన టువంటి ‘భవంతీ’ గృహాలలోని, పెంకుటిండ్లల్లోనీ పై దూలాలను లేదా పై కప్పును గానీ దృఢమయిన కలప స్తంభాలు కూడా గృహంలోని స్తంభాల శ్రేణిలోకే వస్తాయి.

కుట్టక వేధ అంటే ఏమిటి?

వాహనాలు నిలుపుకోవడానికి వాడుతూ వుంటారు.

‘భూమట్టంకంటే గృహం నేలమట్టం పైకి వుండటం’ వాస్తు నియమం. అట్లుగాక ‘భూమట్టంకంటే గృహంలోని నేలమట్టం కిందకి వుండటం’ వలన ఆ గృహం ‘కుట్టకం’ అనే వేధవలన వాస్తు దోషాన్ని పొందుతుంది. ఆ గృహానికి వున్న ముఖద్వార, నైసర్గిక స్వరూప స్థల స్వభావం మొదలయిన సమీకరణాల వలన ఫల సాంద్రత హెచ్చు తగ్గులుగా ఉంటుంది.

‘కుట్టకే భూతదోషస్స్యాత్’ అని శాస్త్ర వచనం. అంటే ‘కుట్టక వేధ’ దోషం ఉన్న గృహం. ఆ గృహ యజమానికి, ఆ గృహంలో నివసించేవారికి ప్రతికూల ఆవేశం, బాధలను, పీడలను, తీరుకొక విధంగా వీలయితే సరిచేసుకొని మంచి ఫలితాలను పొందవచ్చు. ఇంటిలోపల నేలమట్టం తగ్గటానికున్న అనేక కారణాలలో సాధారణ కారణం ఒకటుంది. అంటే ఇంటి ముందున్న రోడ్డు లెవలు కాలక్రమంగా పెరగటం వలన ‘ఇంటిలోపల నేల లెవలు రోడ్డు లెవలుకంటే తగ్గుతుంది’. సాధారణంగా ‘కుట్టకవేధ’ దోషం ఇలా కూడా ప్రారంభమవుతుంది. అందుకని గృహ నిర్మాణ సమయంలోనే గృహం లోపల వీలయినంతగా నేలమట్టం పెంచుకొని, భవిష్యత్తులో అవసరమయితే ఆవరణలో ‘ఫిల్లింగ్’ చేయగలిగే వీలుంచుకోవాలి.

సుప్తక వేధ

‘సప్తే గృహపతేః మృత్యు!’ అనునది శాస్త్ర వచనం. అంటే ఏ గృహమయితే ‘సుప్తక వేధ’ నిద్రించునది అని అర్థం.

శ్లో॥ ప్రద్యోతనా త్పంచనగాంక సూర్య
నవేందు షడ్వంశ నుతేషు భేషు
శేతే మహినైవ గృహం విధేయం
తతాగ వాపి ఖననం నశస్తం
(వాస్తు రత్నావళి)

తా॥ సూర్యుడు వున్న నక్షత్రం మొదలు 5, 7, 9, 12, 19, 26 నక్షత్రాల్లో భూమి నిద్రిస్తూ వుంటుంది. కాబట్టి ఈ నక్షత్రాలయందు గృహం మొదలయినవాటిని నిర్మించకూడదు అని వాస్తు రత్నావళి అనే వాస్తు గ్రంథంలో పేర్కొన్నారు.

శంపాలక వేధ

శంకపాలం జంఘహీనం
శంకపాలే కురూపం స్వాత్ ॥

ఏ గృహమయితే స్థంభాలు లేకుండా వుంటుందో ఆ గృహం ‘శంకపాలము’ అనే వేధా దోషాన్ని కలిగివుంటుంది. బరువు భారం వహించే కుడ్యాలు (load bearing walls) వున్న గృహం స్తంభాలు లేకున్నా, గోడలే స్తంభాలుగా వ్యవహరించవచ్చు. కావున ఇట్టి దోషం కలుగ జాలదు. శాస్త్ర వచనానుసారం ‘శంకపాల వేధ’ దోషంగల గృహ యజమానికి, అందులో నివసించేవారికి అనారోగ్య

వికట వేధ

దిగ్వక్రత్వం వికటం స్మృతం ।
వికటఃపృదుకే రమ్యే విశాల కరాళయోః ॥ (నానార్థ రత్నమాల)

‘వికటం’ అంటే విస్తారమయి నదనియు, మిక్కిలి భయంకరమయినదనియు అర్థం వస్తుంది. సింహద్వారం వికటంగా వున్నట్లయితే ‘వికటం’ అనే వేధ దోషమేర్పడుతుంది. ఒక గృహానికుండే సింహద్వారం ఆ గృహానికుండే అన్ని ద్వారాల కంటే పెద్దదిగాను, రమణీయంగాను వుండాలన్నది వాస్తు నియమం. అంతేగానీ ఒక సింహద్వారం సహజంగా వుండవలసిన పొడవు, వెడల్పు కంటే మించి అసహజంగా, అతిగా వున్నను, భయంకరంగా కనిపించేదిగా వున్నను ‘వికటవేధ దోషం’ను కలుగజేస్తుంది. గృహమంతయు వాస్తు ప్రకారం నిర్మించినా, సింహద్వార విషయంలో పొరబాట్లు జరిగి నట్లయితే చింతించక తప్పదు. ‘వికటవేధ’ దోషం వలన ‘తీరని నష్టాలు’ కలిగే అవకాశం ఉంటుంది. దోషాన్నెరిగి, సవరించుకోవటం వలన శీఘ్రంగా సత్ఫలితాలను పొందవచ్చు. ■

వాస్తువిద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం ‘వాస్తువార్త’లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: **సాయిశ్రీ వాస్తు** కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు: ------------------------------------
పుట్టినతేదీ:------------------ ఊరు: -------------
జన్మనక్షత్రం:---------తల్లిపేరు:--------------------
చిరునామా: -------------------------------------
------------------ ఫోన్: ---------------------

ప్రీ-మేరిటల్ కౌన్సెలింగ్‌కి ఎన్ని రోజులు?

పర్సనల్ పాయింట్

చల్లా సుబ్రహ్మణ్యం
1 సి-ఐక్యూ టవర్స్, 3-4-540,
నారాయణగూడ, హైదరాబాద్-27
మొబైల్: 9866362224/ 9553662224
challascounsel@gmail.com
www.challascounsel.com



యం.సి - ఆదిలాబాద్ జిల్లా

ప్రశ్న: నా వయసు **29**. ఎంగేజ్‌మెంట్ అయింది. పెళ్లికి మరో నెలన్నర సమయం వుంది. నేను, కాబోయే భార్య ఇద్దరం ఉద్యోగస్తులమే. మొదట్నుంచి మేం మీ 'పర్సనల్ పాయింట్' అభిమానులం. అందుకే మీరు చెప్పే ప్రీ-మేరిటల్ కౌన్సెలింగ్ తప్పక తీసుకోవాలనుకుంటున్నాం. ఇద్దరం సెలవు పెట్టుకుని రావాలి కదా! ఫాస్ట్ ట్రాక్‌లో అంటే స్పీడుగా ఎన్ని రోజుల్లో కౌన్సెలింగ్ ఇస్తారు?

జవాబు: మీ అభిమానానికి థాంక్స్. ఇద్దరికీ కలిపి ప్రీ-మేరిటల్ కౌన్సెలింగ్ ఒక 15 గంటలపాటు కావాలి. ఎంత త్వరగా (రోజులు 4 గంటల పాటు) నేర్పినా కనీసం 4 రోజుల సమయం పడుతుంది. గుడ్ లక్!

నా స్థానంలో మీరు ఉంటే?

ఎస్.కె - ప్రకాశం జిల్లా

ప్రశ్న: నా వయసు **20** సంవత్సరాలు. మా ఊళ్లో మాది మంచి పరపతి గల కుటుంబం. మా ఇంట్లో అందరూ బాగా చదువుకున్నవాళ్లే. నేను గత రెండేళ్లుగా ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాను. ఆమె కులం వేరు, నా కులం వేరు. ఆమె కూడా నన్ను ప్రేమిస్తోంది. కానీ మా మధ్య కులం అడ్డుగోడగా నిలిచింది. పెళ్లి సాధ్యం కాదు కనుక స్నేహితులుగా మిగిలిపోవటం మంచిదని నా ప్రియురాలి ఆలోచన.

మరో విషయం ఏమిటంటే- మా నాన్నగారి బ్యాక్‌గ్రౌండ్ ఉపయోగించుకుని జీవితంలో సెటిలవటం నాకిష్టం లేదు. డిగ్రీ పూర్తి చేసుకుని, లేటైనా మంచి పొజిషన్‌కి చేరుకోవాలని ఆశ. కానీ ఏకాగ్రత కుదరటం లేదు. పెళ్లంటూ చేసుకుంటే ఆమెను తప్ప ఎవరినీ చేసుకోలేను. కానీ మా పెద్దలు కచ్చితంగా వద్దంటారు. ఈ కులాలు, మతాలు అనేవి లేకుండా వుంటే ఎంత బాగుంటుందనిపిస్తుంది. నా స్థానంలో మీరుంటే ఏం చేస్తారో చెప్పండి.

జవాబు: నీ స్థానంలో నేనుంటే-

1) ఇప్పుడే పెళ్లికి తొందరపడను

2) చదువు ముగించుకుని, చదువుతోపాటు కంప్యూటర్ నేర్చుకుని మంచి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తాను.

